RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కండి

వివరాలు 3 లో

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జిలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :188 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శనివారం 6 జూన్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# యుద్ధానికి ముగింపు పలుకుదాం.. పుతిన్‌కు జెలెన్‌స్కీ బహిరంగ లేఖ

**యుద్ధాన్ని ముగించేందుకు నేరుగా చర్చలు జరపాలని ప్రతిపాదన**

**లేఖను పుతిన్ చదివారని వెల్లడించిన క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్**

**చర్చలకు తాము సిద్ధంగానే ఉన్నామని రష్యా ప్రకటన**

**స్విట్జర్లాండ్, టర్కీ వంటి దేశాల్లో భేటీకి జెలెన్‌స్కీ సూచన**



ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలికే దిశగా అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో నేరుగా చర్చలు జరిపేందుకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. ఈ మేరకు ఆయన పుతిన్‌కు రాసిన ఒక బహిరంగ లేఖను పుతిన్ స్వీకరించి, పూర్తిగా చదివినట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం (క్రెమ్లిన్) అధికారికంగా వెల్లడించింది. రష్యా అగ్రశ్రేణి వార్తా సంస్థ 'టాస్' కథనం ప్రకారం, సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరమ్ (స్రా×జుఖీ) సదస్సు సందర్భంగా పుతిన్ ప్రెస్ సెక్రటరీ డిమిత్రి పెస్కోవ్ ఈ విషయాన్ని ధృవీకరించారు. "మన మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా ఈ యుద్ధానికి ముగింపు పలుకుదాం. ఇందుకోసం నేను ఒక సమావేశాన్ని ప్రతిపాదిస్తున్నాను" అని జెలెన్‌స్కీ తన లేఖలో పేర్కొన్నారు.

మిగతా 2లో...

# రాష్ట్రంలో ఆక్వా రంగాభివృద్ధికి ఎకో సిస్టం

- -6 ప్రాంతాలు కలుపుతూ కారిడార్
- -బ్లూ ఎకానమీతోనే భవిష్యత్ - ఆర్థికాభివృద్ధి సాధ్యం
- -కేంద్ర మత్స్య శాఖ ప్రాంతీయ కార్యాలయానికి 15 రోజుల్లో భూకేటాయింపులు
- -దేశాన్ని అగ్రపథాన నిలిపేలా అద్భుతంగా పని చేస్తున్న ప్రధాని మోదీ
- -సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్ షాప్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- -కేంద్ర మంత్రులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించిన సీఎం
- -రూ.72 కోట్లతో కాకినాడ పోర్ట్ ఆధునీకరిస్తామన్న కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్





**విశాఖపట్నం, సింధూరదర్శిని:** రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టం ఏర్పాటుచేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆక్వా రంగానికి భారతదేశం లైట్ హౌస్‌లా ఉంటే. దానికి ఏపీని కేంద్ర బిందువు చేస్తామన్నారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఆక్వా కారిడార్ అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ కారిడార్లో ఆక్వా అభివృద్ధికి

మిగతా 2లో...

# జనసేన రాజ్యసభ అభ్యర్థిని ఖరారు చేసిన పవన్ కల్యాణ్?

**ఏపీలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు**

**టీడీపీ 3 స్థానాలు, జనసేన ఒక స్థానంలో పోటీ**

**చాలా కాలంగా లింగమనేని పేరును పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్**



**అమరావతి, సింధూరదర్శిని:** ఏపీలో ఖాళీ అయిన నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్డీయే కూటమి సీట్ల పంపకాలు పూర్తయ్యాయి. టీడీపీ 3, జనసేన ఒక స్థానంలో పోటీ చేయబోతున్నాయి. ఈ మేరకు కూటమి పెద్దలు నిర్ణయాన్ని ప్రకటించారు. ఇక జనసేన కోటాకు దక్కిన ఆ ఒక్క రాజ్యసభస్థానం నుంచి పార్లమెంట్‌కు వెళ్లే అభ్యర్థిని ఆ పార్టీ దాదాపు ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరును జనసేన అధినేత పవన్ కల్యాణ్ దాదాపు ఖరారు చేశారని, ఈ సాయంత్రమే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.

**ఎవరీ లింగమనేని రమేశ్?**

ఈయన ఏపీలో సుపరిచితులైన బిజినెస్ మ్యాన్. ప్రసిద్ధ 'లింగమనేని ఎస్టేట్స్', 'ఎల్ఈపీఎల్ గ్రూప్' సంస్థలకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. విమానయాన రంగం లోకి కూడా ప్రవేశించి, ప్రాంతీయ విమాన యాన సంస్థ 'ఎయిర్ కోస్టా'ను స్థాపించారు.

మిగతా 2లో...



# మంత్రులకు శాఖల కేటాయింపు నా చేతుల్లో లేదు

**సీఎం డీకే శివకుమార్**

**కర్ణాటకలో కొత్త ప్రభుత్వంలో మొదలైన విభేదాలు**

**మంత్రి పదవికి రాజీనామా చేసిన సీనియర్ నేత రామలింగారెడ్డి**

**బెంగళూరు అభివృద్ధి శాఖ దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తి**

**ఇది అధిష్ఠానం నిర్ణయమని స్పష్టం చేసిన సీఎం డీకే శివకుమార్**

కర్ణాటకలో డీకే శివకుమార్ నేతృత్వంలోని నూతన ప్రభుత్వంలో అప్పుడే అసమ్మతి సెగలు మొదలయ్యాయి. తాను ఆశించిన బెంగళూరు అభివృద్ధి శాఖ దక్కలేదన్న అసంతృప్తితో సీనియర్ మంత్రి

మిగతా 2లో...

# ఏపీలో స్మార్ట్ సిటీలు:మంత్రి లోకేష్

**అమరావతి, సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్‌లో సేఫ్ అండ్ స్మార్ట్ సిటీల నిర్వహణ కోసం రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్.. సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రభుత్వ రీజనల్ ఫారిన్ ఎఫైర్స్ విభాగం చీఫ్ ఎక్స్‌పర్ట్ పోలినా పోలుఖినాతో భేటీ అయ్యారు. ఈ భేటీలో ఒక ఉమ్మడి వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి లోకేష్ స్వయంగా వెల్లడించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు లోకేష్ వివరించారు. ప్రధానంగా సేఫ్ ఌ స్మార్ట్ సిటీల నిర్మాణం కోసం పౌరులతో చర్చలు జరపడం, డేటా ఆధారిత నగర నిర్వహణ, డిజిటల్ విద్యను ప్రోత్సహించడం, నగరాల్లో విశ్వసనీయమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. ఏపీలో స్మార్ట్ సిటీల అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానం, అనుభవాన్ని పంచుకునేందుకు ఈ ఉమ్మడి వర్కింగ్ గ్రూప్ దోహదపడుతుందని భావిస్తున్నారు. ఈ సహకారంతో రాష్ట్రంలోని నగరాలను మరింత సురక్షితంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు మార్గం సుగమం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



# డిఎస్సీ-2025 నియామకాలు పూర్తిస్థాయి పారదర్శకతతోనే జరిగాయి

**సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, జి.ఓ.ఎం.ఎస్. నెం.77 ప్రకారమే హారిజాంటల్ రిజర్వేషన్ల అమలు**

**ఎస్.ఎస్.రావత్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (సర్వీసెస్)**



అమరావతి, సింధూరదర్శిని: డిఎస్సీ-2025 నియామకాల్లో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, జి.ఓ.ఎం.ఎస్. నెం.77 ప్రకారమే హారిజాంటల్ రిజర్వేషన్లను అమలు చేస్తూ, పూర్తిస్థాయి పారదర్శకతతో నియామక ప్రక్రియ నిర్వహించడం జరిగిందని సర్వీసెస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో

మిగతా 2లో...

# రాష్ట్రంలో ఆక్వా రంగాభివృద్ధికి ఎకో సిస్టం

(మొదటిపేజీ తరువాయి)
అవసరమైన రీసెర్చ్, ఇన్నోవేషన్, స్టార్టప్స్, టెక్నాలజీని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అతి తక్కువ వ్యయంతో అత్యధిక ఉత్పత్తి సాధించడమే లక్ష్యమని చెప్పారు. ఆక్వా ఉత్పత్తులకు సంబంధించిన ఉప ఉత్పత్తులతో కూడా ఆర్థిక ప్రగతి సాధించవచ్చన్నారు. శుక్రవారం విశాఖలో జరిగిన సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్ షాప్‌లో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఆంధ్రా ష్రింప్, ఇండియా సీ-ఫుడ్' బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తున్నామని చెప్పారు.ఆక్వారంగఅభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన నాలుగు శాఖలకు చెందిన కేంద్ర మంత్రులు ఒకేవేదికపై రావడం శుభపరిణామంగా అభివర్ణించారు.

**రాష్ట్రంలో మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు**

'రూ.72 కోట్లతో కాకినాడ పోర్ట్ మోడ్రనైజేషన్ చేపడతామని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించినందుకు సంతోషం. కేంద్ర మత్స్య శాఖకు ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15 రోజుల్లో కేటాయిస్తాం. నెల రోజుల్లో కార్యాలయానికి శంకుస్థాపన చేసి నిర్మాణం ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతున్నాను. ఆక్వా ఉత్పత్తులను మరింత పెద్ద స్థాయిలో ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రం తీసుకునే చర్యలకు రాష్ట్రం వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుంది. మెగా సీ-ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తామని ఇప్పటికే చెప్పింది. వికసిత్ భారత్ లక్ష్యాలు చేరుకోవడానికి బ్లూ ఎకానమీ ఎంతో కీలకం. పాండ్ టు పోర్ట్, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్, బ్లూ ఎకానమీ టు వికసిత్ భారత్ అనే విధానంతో పని చేయాలి. భారత ఆశలను... ఆశయాలను నెరవేర్చేందుకు ఏపీ బ్లూ ఎకానమీ దోహదపడుతుందని భావిస్తున్నా. ప్రపంచ వ్యాప్తంగా జరిగే సీ-ఫుడ్ బిజినెస్‌లో ఇండియా వాటా కేవలం 5 శాతం మాత్రమే ఉంది. ఈ రంగంలో ఇండియాకు పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఏటా రూ.28,000 కోట్ల ఎగుమతులు**

'భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదే. బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్న చోట నాగరికతలు విలసిల్లుతాయి... ఏపీలో గోదావరి, కృష్ణ వంటి జీవ నదులు ఉన్నాయి. సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఏపీ రెండో అతి పెద్ద రాష్ట్రం. 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఉత్పత్తి ఏపీలో జరుగుతోంది. ఏపీలో బ్లూ ఎకానమీ పెరిగితే... దేశ ప్రగతికి దోహద పడుతుంది. భారతదేశం మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతంగా ఉంది. భారతదేశం మొత్తం రొయ్యల ఉత్పత్తిలో ఏపీ షేర్ 66 శాతం. భారతదేశం మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో దాదాపు ఏపీ నుంచే 38 శాతం ఆదాయం వస్తోంది. సంవత్సరానికి రూ.28,000 కోట్లకు పైగా సముద్ర ఆహార ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే, భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులు కూడా అభివృద్ధి చెందుతాయి. ఆక్వా రంగంలో ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణలు చేస్తే, భారతదేశ బ్లూ ఎకానమీ నిస్సందేహంగా ముందుకు సాగుతుంది. ఏపీలో 1,053 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. ఏపీకి పోర్టులు, ఎయిర్ పోర్టులు ఉన్నాయి. ఏ రంగం, ఏ ఉత్పత్తి అయినా సక్సెస్ కావాలంటే క్వాలిటీ, సస్టైనబుల్టీ, ట్రేసబులిటీ, ఇన్నోవేషన్, జీరో పొల్యూషన్ అనేది ముఖ్యం. సీ-ఫుడ్ ఎగుమతుల అభివృద్ధికి ప్రతీ స్టేక్ హోల్డర్ బాధ్యత తీసుకోవాలి, సహకరించాలి.' అని సీఎం అన్నారు.

**ప్రధాని మోదీని మరింత బలపరుద్దాం**

'ఆక్వా పరిశ్రమలో ఇన్నోవేషన్లు చేసే వారిని ఆంధ్రప్రదేశ్ ఆహ్వానిస్తోంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ఏపీ పని చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెడితే.. ఆ పెట్టుబడులకు ప్రోత్సాహమిచ్చి... అభివృద్ధి చేస్తాం. ఆక్వా ఉత్పత్తులతో చక్కటి ఆరోగ్యం లభిస్తుంది. ప్రజలు ఇప్పుడు ప్రొటీన్ ఉత్పత్తులనే ఆహారంగా తీసుకుంటున్నారు. ఆక్వా ఉత్పత్తుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. ప్రొటీన్ ఫుడ్ తీసుకోవడంతోపాటు... ప్రతీ రోజూ సైకిలింగ్ చేయాలి. ఇవాళ ఈ సమావేశానికి సైకిలింగ్ చేసుకుంటూనే వచ్చాను. సైకిలింగ్ ద్వారా ఆరోగ్యం బాగుంటుంది... ఖర్చులూ తగ్గుతాయి. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం. సరైన సమయంలో సరైన నేత నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండటం అదృష్టం. 21వ శతాబ్దం నరేంద్ర మోదీదే... భవిష్యత్తులో భారత దేశాన్ని అగ్ర భాగంలో నిలపడానికి ప్రధాని మోదీ అద్భుతంగా పని చేస్తున్నారు. ప్రధానిగా 12 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న మోదీని మరింత బలపర్చాల్సిన అవసరం ఉంది.' అని సీఎం చెప్పారు.

**కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఉత్పత్తులు**

ఆక్వా రంగం అభివృద్ధిపై కేంద్ర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆక్వా రంగం విషయంలో కేంద్ర ప్రభుత్వం సంక్షోభం నుంచి అవకాశాలను అన్వేషిస్తోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు. అమెరికా టారిఫ్‌లు విధించినప్పటికీ... గతేడాది కంటే మిన్నగా ఆక్వా ఎగుమతులు చేసుకోగలిగామని, అంతర్జాతీయంగా కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఎగుమతులు వెళ్లాయన్నారు. ఇప్పుడు మన ఆక్వా ఉత్పత్తులకు మరిన్ని మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆక్వా ఎగుమతులతో ఆర్థికాభివృద్ధితో పాటు.. మత్స్యకారులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. మోడ్రనైజ్డ్ బోట్లను మత్స్యకారులకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని, 200 మోడ్రనైజ్డ్ బోట్లు ఏపీకి వస్తున్నాయని చెప్పారు. ప్రజల ఆహార అలవాట్లు మారాయని, ప్రొటీన్ ఆహారాన్ని అధికంగా తీసుకుంటున్నారని... దీంతో ప్రొటీన్ ఎక్కువ ఉండటం వల్ల ఆక్వా ఉత్పత్తులకు రోజు రోజుకూ డిమాండ్ పెరుగుతోందన్నారు.

**సీ-ఫుడ్ ప్రాసెసింగ్‌లో విస్తృత అవకాశాలు**

ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ...'ఆక్వాలో కేవలం 12 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేస్తున్నాం... సీ-ఫుడ్ ప్రాసెసింగ్ విషయంలో మరింత అభివృద్ధి చేయాలి. ఆక్వాలో టెక్నాలజీ, ఇన్నోవేషన్లకు పెద్ద పీట వేయాలి. వ్యవసాయంతో పోల్చుకుంటే ఆక్వాలో ఎక్కువ అభివృద్ధి కనిపిస్తోంది. ఆక్వాకు రూ.1.50కే విద్యుత్ ఇస్తున్నాం. ఫిష్ ఫీడ్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఫిష్ మీల్ ఎగుమతులను 50 శాతానికి పరిమితం చేయాలని కోరుతున్నాం. సోయా విషయంలోనూ కేంద్రం నుంచి సహకారం అవసరం. ఇతర దేశాలతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లు జరగాల్సి ఉంది.. దీనికి కేంద్రం ఇప్పటికే సహకరిస్తోంది. ప్రపంచంలోని ప్రతీ కిచెన్‌లోకి ఇండియన్ ఆక్వా ఉత్పత్తులు వెళ్లేలా కేంద్రం ప్రణాళికలు రూపొందించడం సంతోషంగా ఉంది.' అని అన్నారు.

**సర్కులర్ ఎకానమీతో 'ఆక్వా' అనుసంధానం**

'పీఎంఎంకేఎస్ఎస్‌వై పథకాన్ని ఏపీలో అమలు చేస్తాం... విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం... ఏడాది 30 బిలియన్ యూఎస్ డాలర్ల విలువైన ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వ లక్ష్యం పెట్టుకుంది. కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యంలో 30 శాతం ఏపీ వాటా ఉంటుందని హామీ ఇస్తున్నాం. సర్కులర్ ఎకానమీకి ఆక్వా రంగాన్ని అనుసంధానం చేసేలా భీమవరంలో ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందిస్తోంది. మార్కెట్ ఇబ్బందులతో మద్దతు ధర కోల్పోయిన వివిధ పంటల రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నాం. ప్రపంచవ్యాప్తంగా భారత దేశానికి గౌరవం దక్కడానికి కారణం ప్రధాని నరేంద్ర మోదీనే. చాలా దేశాల్లో చాలా ఇబ్బందులు, సమస్యలు ఉన్నాయి... భారత దేశాన్ని ప్రధాని సమర్థవంతంగా నడిపిస్తున్నారు. సూర్య ఘర్, పీఎం కుసుమ్ వంటి వాటిని కేంద్రం ప్రోత్సహిస్తోంది. అమెరికాలో నాలుగు పవర్ గ్రిడ్లు ఉన్నాయి... భారత దేశంలో ఒకే సెంట్రల్ పవర్ గ్రిడ్ ఉంది. భారత దేశంలో ఏ మారుమూల విద్యుత్ ఉత్పత్తి చేసినా... కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎక్కడైనా వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ పరిణామాలన్నీ 2014 తర్వాతే జరిగాయి. గతంలో సోలార్ విద్యుత్ యూనిట్‌కు ఉత్పత్తి వ్యయం రూ.14గా ఉండేది.. ఇప్పుడు యూనిట్‌కు రూ.2.40కు వ్యయం తగ్గింది. గతంలో సోలార్ ప్యానెళ్లను దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది.. కానీ ప్రధాని మోదీ నిర్ణయాలతో ఇప్పుడు ఏపీలో సోలార్ ప్యానెళ్లు ఉత్పత్తి చేసుకుంటున్నాం.' అని అన్నారు.

## డిఎస్సీ-2025 నియామకాలు పూర్తిస్థాయి పారదర్శకతతోనే జరిగాయి

(మొదటిపేజీ తరువాయి)
రాష్ట్ర విద్యా శాఖ సెక్రటరీ కోన శశిధర్, శాప్ వైస్ చైర్మన్ ఽ మేనేజింగ్ డైరెక్టర్ భరణితో కలసి ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ డిఎస్సీ-2025 నియామకాలపై సమగ్ర వివరణ ఇచ్చారు. డీఎస్సీ-2025 నియామకాల్లో హారిజాంటల్ రిజర్వేషన్లు, స్పోర్ట్స్ కోటా, దివ్యాంగుల కోటా అమలుపై కొంత మంది అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న సందేహాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాల్లో ఏమాత్రం నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎస్.రావత్ మాట్లాడుతూ మొత్తం నియామక ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా, సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా, జి.ఓ.ఎం.ఎస్. నెం.77 మరియు సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించబడినట్లు స్పష్టం చేశారు. రిజర్వేషన్లు ప్రధానంగా వెర్టికల్ మరియు హారిజాంటల్ అనే రెండు విధాలుగా అమలు చేయడం జరిగిందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వంటి సామాజిక వర్గాలకు వర్తించే రిజర్వేషన్లు వెర్టికల్ రిజర్వేషన్లు కాగా, మహిళలు, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్, క్రీడాకారులు వంటి వర్గాలకు వర్తించేవి హారిజాంటల్ రిజర్వేషన్లని తెలిపారు. వెర్టికల్ రిజర్వేషన్లకు 100 పాయింట్ల రోస్టర్ వ్యవస్థలో నిర్దిష్ట రోస్టర్ పాయింట్లు ఉంటాయని, అయితే హారిజాంటల్ రిజర్వేషన్లకు స్థిరమైన రోస్టర్ పాయింట్లు ఉండవన్నారు. ఆయా కమ్యూనిటీ వర్గాల పరిధిలోనే ఈ రిజర్వేషన్లు అమలవుతాయన్నారు. అంటే, స్పోర్ట్స్ కోటా లేదా దివ్యాంగుల కోటాకు చెందిన అభ్యర్థి ఏ సామాజిక వర్గానికి చెందినవారో, ఆ కమ్యూనిటీ కేటగిరీలోనే సంబంధిత రిజర్వేషన్ పరిగణించబడుతుందన్నారు.

ఇంద్రసాహ్నీ కేసు (1992), రాజేష్ కుమార్ దర్యా కేసు (2007), ఉత్తరాఖండ్ ప్రభుత్వం వర్సెస్ మమతా బిష్ట్ (2010) తదితర సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా హారిజాంటల్ రిజర్వేషన్ల అమలుపై స్పష్టమైన మార్గదర్శకాలు వెలువడ్డాయని తెలిపారు. ఈ తీర్పుల ప్రకారం హారిజాంటల్ రిజర్వేషన్లకు ఫిక్సుడ్ రోస్టర్ పాయింట్లు ఉండవని, ఆయా శాతం పరిధిలోనే రిజర్వేషన్లు అమలు కావాలని, మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులను సంబంధిత కమ్యూనిటీ వర్గాల్లోనే సర్దుబాటు చేయాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ అంశాలపై ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ నివేదిక సమర్పించిన అనంతరం ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్. నెం.77 జారీ చేసినట్లు తెలిపారు. డీఎస్సీ-2025లో జరిగిన ప్రతి ఎంపిక కూడా మెరిట్, రిజర్వేషన్ నిబంధనలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు మరియు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించబడిందని ఆయన స్పష్టం చేశారు.

మెరిట్, రాజ్యాంగబద్ధ రిజర్వేషన్ ప్రాతిపదికనే ప్రతి నియామకం పారదర్శకంగా జరిగింది .... విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్

రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ మెరిట్, రాజ్యాంగబద్ధ రిజర్వేషన్ ప్రాతిపదికనే ప్రతి నియామకం ఎంతో పారదర్శకంగా జరిగిందని తెలిపారు. జి.ఓ.ఎం.ఎస్. నెం.77 అమలులోకి వచ్చిన తర్వాత జరిగిన తొలి భారీ నియామక ప్రక్రియ డీఎస్సీ-2025 కావడంతో, హారిజాంటల్ రిజర్వేషన్ల అమలుపై కొంత మందిలో సందేహాలు వ్యక్తమయ్యాయని తెలిపారు. అయితే మొత్తం ఎంపిక ప్రక్రియలో ఎటువంటి నిబంధనల ఉల్లంఘన జరగలేదని, ప్రతి ఎంపిక మెరిట్ మరియు రిజర్వేషన్ ప్రకారమే నిర్వహించబడిందని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పూర్తిగా అనుసరించామని స్పష్టం చేశారు. హారిజాంటల్ రిజర్వేషన్ విధానం సులభంగా అర్థమయ్యే విధంగా బస్సులో ఎక్కుతున్న ప్రయాణీకులతో పోల్చుతూ ఉదాహరణగా ఒక బస్సులో ముందుగా మెరిట్ ఆధారంగా ప్రయాణికులను ఎక్కించిన తర్వాత, మహిళలు లేదా ఇతర హారిజాంటల్ వర్గాలకు అవసరమైన శాతం తక్కువగా ఉంటే, అదే కమ్యూనిటీ వర్గాల్లో సర్దుబాటు చేయడం హారిజాంటల్ రిజర్వేషన్ విధానమని తెలిపారు. ముందుగానే ప్రత్యేక రోస్టర్ పాయింట్లు కేటాయించడం హారిజాంటల్ రిజర్వేషన్ విధానం కాదని స్పష్టం చేశారు. దివ్యాంగుల కోటా అమలులో కూడా స్పష్టమైన ధృవీకరణ ప్రక్రియ పాటించినట్లు వెల్లడించారు. దివ్యాంగుల కోటాలో దరఖాస్తు చేసిన ప్రతి అభ్యర్థిని మెడికల్ బోర్డుకు రిఫర్ చేసినట్లు, 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ దివ్యాంగత ధృవీకరణ పొందిన వారినే అర్హులుగా పరిగణించినట్లు తెలిపారు. ఈ నిబంధనలను నోటిఫికేషన్ విడుదల సమయంలోనే స్పష్టంగా ప్రకటించినట్లు వివరించారు.

ఉద్యోగాల కోసం కష్టపడి సిద్ధమైన ప్రతి అభ్యర్థి ఆశలు, ఆవేదనలు ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని పేర్కొన్నారు. అయితే ఎంపికైన ప్రతి అభ్యర్థి కూడా మెరిట్, రిజర్వేషన్ నిబంధనలు, ధృవీకరించిన అర్హతలు, నోటిఫికేషన్ నిబంధనల ఆధారంగానే ఎంపికైన వారేనని స్పష్టం చేశారు. 3.36 లక్షల మందికి పైగా అభ్యర్థులు పోటీ పడిన ఈ భారీ నియామక ప్రక్రియలో పరిమిత సంఖ్యలో మాత్రమే పోస్టులు అందుబాటులో ఉండటంతో సహజంగానే కొంతమందిలో నిరాశ ఉండవచ్చని పేర్కొన్నారు. అయితే ఆధారరహిత ఆరోపణలు, తప్పుడు ప్రచారాల ద్వారా ఎంపిక ప్రక్రియను తప్పుగా చిత్రీకరించడం సరికాదని తెలిపారు.

పూర్తిగా మెరిట్, ప్రాధాన్యత క్రమం, ధృవీకరణ ఆధారంగానే స్పోర్ట్స్ కోటాలో ఎంపికలు- శాప్ ఎం.డి. భరణి

డీఎస్సీ-2025 నియామకాల్లో స్పోర్ట్స్ కోటా ఎంపికల విషయంలో అన్ని నిబంధనలు, జి.ఓ. మార్గదర్శకాలు, ధృవీకరణ ప్రక్రియలను ప్రభుత్వం కచ్చితంగా అమలు చేసినట్లు శాప్ వి.సి. మరియు ఎం.డి. భరణి స్పష్టం చేశారు. స్పోర్ట్స్ సర్టిఫికెట్లు ప్రభుత్వం జారీ చేయదని, రాష్ట్ర స్థాయి క్రీడా సంఘాలు, జాతీయ ఫెడరేషన్లు, విశ్వవిద్యాలయాలు, గుర్తింపు పొందిన క్రీడా సంస్థలే ఆయా సర్టిఫికెట్లు జారీ చేస్తాయని తెలిపారు. అభ్యర్థులు సమర్పించిన ప్రతి స్పోర్ట్స్ సర్టిఫికెట్‌ను సంబంధిత సంస్థల ద్వారా ధృవీకరించిన తర్వాత మాత్రమే పరిగణనలోకి తీసుకున్నట్లు వెల్లడించారు.నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్లు సమర్పించినట్లు తేలితే అభ్యర్థిత్వం రద్దు చేయడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం, అవసరమైతే సంబంధిత అధికారులపై విచారణ చేపట్టే నిబంధనలు ఇప్పటికే జి.ఓ.లు మరియు నోటిఫికేషన్‌లలో స్పష్టంగా ఉన్నాయని తెలిపారు.

## జనసేన రాజ్యసభ అభ్యర్థిని ఖరారు చేసిన పవన్ కల్యాణ్?

(మొదటిపేజీ తరువాయి)
గతంలో ఈయన టీడీపీ అధినేత చంద్రబాబుకి అత్యంత సన్నిహితుడిగా ఉండేవారు. అయితే, చాలా కాలంగా పవన్ ఈయన పేరును రాజ్యసభ స్థానానికి పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కూటమి సీట్ల సర్దుబాటు ముగియడం, జనసేన అభ్యర్థిగా లింగమనేని పేరు దాదాపు ఖరారు కావడంతో ఏపీ రాజ్యసభ ఎన్నికల రాజకీయం మరింత ఆసక్తికరంగా మారింది.

# మంత్రులకు శాఖల కేటాయింపు నా చేతుల్లో లేదు

(మొదటిపేజీ తరువాయి)
ఆర్. రామలింగారెడ్డి తన పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. అయితే, శాఖల కేటాయింపు తన చేతుల్లో లేదని, అది పూర్తిగా కాంగ్రెస్ అధిష్ఠానం పరిధిలోని అంశమని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు.ఇటీవలే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డీకే శివకుమార్‌కు ఈ పరిణామం తొలి సవాల్‌గా మారింది. ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన రామలింగా రెడ్డి, తనకు కేటాయించిన జలవనరుల శాఖ పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉదయం రాజీనామా చేశారు. గతంలో తనకు బెంగళూరు అభివృద్ధి శాఖను కేటాయిస్తానని డీకే శివకుమార్ హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు ఆ శాఖను కృష్ణ బైరేగౌడకు కేటాయించారని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై స్పందించిన సీఎం డీకే శివకుమార్, రామలింగారెడ్డికి హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని అంగీకరించారు. "నేను నా వంతు ప్రయ త్నం చేశాను, కానీ తుది నిర్ణయం అధిష్ఠానం తీసుకుంది.

ఆయన నా మిత్రుడు, స్వయంగా వెళ్లి ఆయనతో మాట్లాడతాను" అని శివకుమార్ తెలిపారు. మరోవైపు, రామలింగారెడ్డి తన రాజీనామా లేఖపై బహిరంగంగానే సంతకం చేశారు. తనకు పదేపదే అవమానం జరుగు తోందని, ఆత్మసాక్షికి విరుద్ధంగా పనిచేయలేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తాను పార్టీలోనే కొనసాగుతానని, కేవలం మంత్రి పదవికి మాత్రమే రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ వివాదంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని ఆయనను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తోందని, ఒకవేళ ఆయన మెత్తబడకపోతే రాజీనామాను ఆమోదించే దిశగా యోచిస్తున్నట్లు సమాచారం.

ప్రస్తుతం ఈ రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు పార్టీ అగ్రనేతలు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.

## వైఎస్ షర్మిలకు నిరాశ.. దక్కని రాజ్యసభ టికెట్

**షర్మిల కర్ణాటక నుంచి రాజ్యసభకు పోటీ చేయబోతున్నారంటూ కొన్ని రోజులుగా ప్రచారం**

**కర్ణాటక నుంచి మూడు స్థానాలను ప్రకటించిన పార్టీ అధిష్ఠానం**

**షర్మిలకు టికెట్ దక్కకపోవడంతో అభిమానుల నిరాశ**

అమరావతి, సింధూరదర్శిని:
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల కర్ణాటక నుంచి రాజ్యసభకు పోటీ చేయబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా జోరుగా సాగిన ఊహాగానాలకు తెరపడింది. కాంగ్రెస్ అధిష్ఠానం తాజాగా ప్రకటించిన రాజ్యసభ అభ్యర్థుల తుది జాబితాలో షర్మిలకు చోటు దక్కలేదు. కర్ణాటక నుంచి ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ స్థానాలను భర్తీ చేసే క్రమంలో.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది.


కర్ణాటక కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు వీరే:
మల్లికార్జున్ ఖర్గే: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు
పవన్ ఖేడా: ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి.
మన్సూర్ ఆలీ ఖాన్: కేంద్ర మాజీ మంత్రి రెహ్మాన్ ఖాన్ కుమారుడు.

మల్లికార్జున్ ఖర్గే ఈరోజు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ సీఎం సిద్ధరామయ్య సహా పలువురు కీలక నేతలు హాజరుకానున్నారు. మరోవైపు, రాజ్యసభ ద్వారా పార్లమెంట్‌లో అడుగుపెట్టాలనుకున్న షర్మిలకు ఈసారి టికెట్ దక్కకపోవడంతో ఆమె అనుచరులు, కాంగ్రెస్ అభిమానులు తీవ్ర నిరాశకు లోనయ్యారు.



## యుద్ధానికి ముగింపు పలుకుదాం

(మొదటిపేజీ తరువాయి)
"యూరప్ దృష్టి మళ్లీ ఈ యుద్ధంపై పడే వరకు వేచి చూడటం సరికాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ శాంతి చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు స్విట్జర్లాండ్, టర్కీ, అరబ్ దేశాలు ముందుకు రావాలని ఆయన సూచించారు. చర్చలకు స్పష్టమైన తేదీని నిర్ణయించుకోవాలని కూడా ప్రతిపాదించారు. చర్చలు జరిగేంత కాలం పూర్తిస్థాయి కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని జెలెన్స్కీ తన లేఖలో హామీ ఇచ్చారు. "ఇది ప్రామాణికమైన పద్ధతి. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి నిజమైన నిశ్శబ్దాన్ని నెలకొల్పడమే ఉత్తమ మార్గం. ఇది కేవలం ప్రయత్నం కాదు, మీకు నిజంగా ఆసక్తి ఉంటే ఇది నిజమైన కాల్పుల విరమణ అవుతుంది" అని ఆయన వివరించారు. ఈ లేఖపై ప్రపంచ దేశాల నేతల నుంచి వచ్చిన స్పందనల గురించి కూడా పుతిన్‌కు తెలియజేశామని పెస్కోవ్ తెలిపారు. ఈ పరిణామంపై పెస్కోవ్ స్పందిస్తూ, చర్చలను పునఃప్రారంభించాలని రష్యా కోరుకుంటోందని అన్నారు. "ప్రస్తుతం నెలకొన్న స్తబ్దత త్వరలోనే ముగుస్తుందని, చర్చలు మళ్లీ మొదలవుతాయని ఆశిస్తున్నాం. ఇప్పటికే అమెరికాతో పలు మార్గాల్లో సంప్రదింపులు జరుపుతున్నాం" అని ఆయన తెలిపారు. "పుతిన్ చర్చలకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. రష్యాతో మాట్లాడకూడదనే తమ వైఖరిని యూరప్ దేశాలు విడిచిపెడితే, వారు కేవలం ఫోన్ చేసి మాట్లాడితే సరిపోతుంది" అని పెస్కోవ్ వ్యాఖ్యానించారు. అయితే, ఉక్రెయిన్‌తో వివాదం చాలా సంక్లిష్టమైనదని, అది అంత సులభంగా పరిష్కారమయ్యేది కాదని కూడా ఆయన అభిప్రాయపడినట్లు టాస్ నివేదించింది.



# యోగాంధ్రను విజయవంతం చేయాలి

**అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026ను ఘనంగా నిర్వహిద్దాం - జిల్లాలో యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విజయవంతం చేయాలి**

**ఈ నెల 7న స్వర్ణాల చెరువు, 8న మైపాడు బీచ్‌లో యోగా ప్రదర్శనలు**

**యోగాంధ్ర-2026 వెబ్సైట్ ద్వారా ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి: జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు**

నెల్లూరు ( సింధూర దర్శిని) 5 జూన్ నెల్లూరు జిల్లా ; అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఈనెల 21న చేపట్టనున్న 12వ అంతర్జాతీయ యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం సాయంత్రం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం లో యోగాంధ్ర-2026 కార్యక్రమాల నిర్వహణ, ఏర్పాట్లు, రిజిస్ట్రేషన్లు, ప్రజల భాగస్వామ్యంపై జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భం గా ప్రజలకు యోగాను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యోగాంధ్ర-2026 కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఆనందాన్ని అందించే యోగాను ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం చేయాలనే ఉద్దేశంతో విస్తృత కార్యక్రమాలను రూపొంది ంచినట్లు తెలిపారు. జూన్ 21న నెల్లూరులోని ఏ.సి. సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా స్థాయి ప్రధాన యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ముందుగా జిల్లాలోని పలు ప్రముఖ పర్యాటక ప్రదేశాలు, గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక యోగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. జూన్ 7న స్వర్ణాల చెరువు, జూన్ 8న మైపాడు బీచ్‌లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగా ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జూన్ 12న రెసిడెన్షియల్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో థీమాటిక్ యోగా కార్యక్రమాలు, జూన్ 16న రామతీర్థం బీచ్, జూన్ 17న స్వర్ణాల చెరువు వద్ద ప్రత్యేక పర్యాటక యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 7 నుంచి గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలలో యోగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల నిర్వహణలో విద్యాశాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామం, వార్డులో యోగా బృందాలను ఏర్పాటు చేసి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని ఆదేశించారు. జిల్లాలోని మాస్టర్ ట్రైనర్లు, శిక్షకులు, విద్యార్థులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థలు, పౌరులు పెద్ద సంఖ్యలో యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు. యోగాంధ్ర 2026 వెబ్‌సైట్ ద్వారా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారులు పూర్తి సహకారం అందించాలని తెలిపారు. జిల్లా స్థాయిలో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి కార్యక్రమాల పురోగతిని పర్యవేక్షించాలని, అన్ని శాఖలు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా కృషి చేయాలని ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమాలకు ప్రింట్, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సంబంధిత అధికారులను సూచించారు. యోగాంధ్ర-2026 కార్యక్రమాల నిర్వహణపై శుక్రవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఎంపీడీవోలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో యోగాంధ్ర-2026 నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ నాగరాజు కుమారి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, ఆయుష్ వైద్యులు శ్రీనివాసరాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కండి

**అవగాహనా ర్యాలీలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్, కమిషనర్**




నెల్లూరు (సింధూర దర్శిని) 5 జూన్ నెల్లూరు జిల్లా; ప్రతి జీవికీ జీవనాధారమైన ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, పర్యావరణ పరిరక్షణా చర్యలలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి.వెంకటేశ్వర్లు, కమిషనర్ వై.ఓ నందన్ లు ఆకాంక్షించారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీని శుక్రవారం ఉదయం నిర్వహించారు. స్థానిక వి.ఆర్ కళాశాల కూడలి నుంచి ఏ.సి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ మీదుగా వి.ఆర్.సి వరకు నిర్వహించిన ర్యాలీని జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ర్యాలీలో పాల్గొన్న వారితో పర్యావరణహిత ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణంపై అవగాహన, సమస్యల పరిష్కారానికి ఐక్యరాజ్యసమితి ప్రతి ఏడాది జూన్ 5న పర్యావరణ దినోత్సవాన్ని జరపాలని తీర్మానం చేసిందని తెలిపారు. గ్లోబల్ వార్మింగ్, అడవుల నరికివేత, గాలి కాలుష్యం, ప్లాస్టిక్ వాడకం వంటివి ప్రధాన పర్యావరణానికి సమస్యలపై కార్యాచరణ కోసం ఏటా 143 దేశాలు పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకుందని వివరించారు. పర్యావరణంపై ప్రజలకు అవగాహన పెంచడానికి ఒక్కో సంవత్సరం ఒక్కో థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే పరిరక్షణా ర్యాలీని చేపట్టామని తెలిపారు. వాతావరణంలో వచ్చే మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, భూకంపాలు, సునామీలు, అగ్ని పర్వతాలు బద్దలవడం, ఇండస్ట్రియల్ పొల్యూషన్ వల్ల మానవాళిపై పెను ప్రభావం పడుతోందని, ప్రజలంతా బాధ్యతగా భావించి తమ పరిధిలో కాలుష్య నియంత్రణ చర్యలు పాటించాలని కోరారు. సమస్త జీవవాళి మనుగడకు అవసరమైన పర్యావరణాన్ని పరిరక్షించుకుని, రాబోయే తరాలకు ఆరోగ్యమైన భవిష్యత్తును అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రతిఒక్కరూ బాధ్యతగా పాటించాలని వారు ఆకాంక్షించారు. ప్రతిఒక్కరూ తమ దైనందిన అలవాట్లలో చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగంపై నియంత్రణ, జౌళి సంచుల వాడకం, విద్యుత్ ఆదా, సోలార్ వస్తువుల వినియోగం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కాలుష్య ఉద్గారాల నియంత్రణ, తక్కువ దూరాలకు సైక్లింగ్, సాధ్యమయినంతవరకు ప్రజా రవాణా వాడటం, లిఫ్ట్ కు బదులుగా మెట్లను వాడటం వంటి చర్యలతో మార్పుకోసం ప్రయత్నించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవసరమైన ర్యాలీలు, నడక పోటీలు, మారథాన్ వంటి వినూత్న కార్యక్రమాలను క్రమంతప్పకుండా అమలు చేయనున్నామని తెలిపారు. వివిధ రకాల ప్రోత్సాహక కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం పెంచి, కాలుష్యరహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములయ్యేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణా ర్యాలీలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈ.ఈ అశోక్ కుమార్, అధికారులు, నెల్లూరు నగర పాలక సంస్థ అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అటవీ శాఖ సిబ్బంది, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం లో భాగంగా స్థానిక వి.ఆర్ కళాశాల ప్రాంగణం మైదానం మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంగణంలో మొక్కలను నాటి సంరక్షించే బాధ్యతలను వారు చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై వివిధ పాఠశాలలలో నిర్వహించిన ఎస్సే రైటింగ్ పోటీల విజేతలకు జాయింట్ కలెక్టర్, కమిషనర్ లు బహుమతులను అందజేశారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయండి

**మేయర్ దేవరకొండ సుజాత అశోక్, కమిషనర్ వై ఓ.నందన్**



నెల్లూరు ( సింధూరదర్శిని) 5 జూన్ నెల్లూరు జిల్లా; మానవాళి మనుగడకు అవసరమైన ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, పర్యావరణ పరిరక్షణా చర్యలను ప్రజలంతా బాధ్యతగా చేపట్టాలని నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ దేవరకొండ సుజాత అశోక్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేయర్ పాల్గొని మాట్లాడుతూ ప్రజలంతా బాధ్యతగా భావించి తమ పరిధిలో కాలుష్య నియంత్రణ చర్యలు పాటించాలని కోరారు. సమస్త జీవవాళి మనుగడకు అవసరమైన పర్యావరణాన్ని పరిరక్షించుకుని, రాబోయే తరాలకు ఆరోగ్యమైన భవిష్యత్తును అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రతిఒక్కరూ బాధ్యతగా పాటించాలని మేయర్ ఆకాంక్షించారు. అనంతరం నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ దైనందిన అలవాట్లలో చిన్న చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం పై నియంత్రణ, జౌళి సంచుల వాడకం, విద్యుత్ ఆదా, సోలార్ వస్తువుల వినియోగం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం, కాలుష్య ఉద్గారాల నియంత్రణ, తక్కువ దూరాలకు సైక్లింగ్, సాధ్యమయినంతవరకు ప్రజా రవాణా వాడటం, లిఫ్ట్ కు బదులుగా మెట్లను వాడటం వంటి చర్యలతో మార్పుకోసం ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ



కావలి (సింధూర దర్శిని) 5 జూన్ నెల్లూరు జిల్లా ; జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు కావలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముసునూరు గ్రామం, వినాయకనగర్ ప్రాంతంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కావలి రూరల్ సీఐ ఆధ్వర్యంలో ఎస్సైలు మరియు 22 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం సుమారు 150 ఇళ్లు, వ్యక్తులు, వాహనాలను తనిఖీ చేసింది. తనిఖీలలో ఎటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు గుర్తించబడకపోగా, పత్రాలు లేని 36 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ఇద్దరు అనుమానిత షీటర్ల కదలికలపై కూడా వివరాలు సేకరించారు. అనంతరం నిర్వహించిన అవగాహన సమావేశంలో సైబర్ మోసాల నివారణ, మహిళలు, చిన్నారుల భద్రత, ఆస్తినేరాల నియంత్రణ, రోడ్డు భద్రతా నియమాలు, డయల్-112, ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్-1972, సైబర్ హెల్ప్ లైన్ 1930, పోలీస్ కంట్రోల్ రూమ్ 9392903413 వంటి అత్యవసర సేవలు, శక్తి యాప్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని జిల్లా ఎస్పీ తెలిపారు.

# పర్యావరణాన్ని పరిరక్షించాలి

**ఏపీ ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు యలపల్లి శ్రీనివాసులు**



గూడూరు (సింధూర దర్శిని) 5 జూన్ నెల్లూరు జిల్లా ; పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు యాలపల్లి శ్రీనివాసులు తెలిపారు. శ్రీనివాసులు మాట్లాడుతూ మనవడు వెంకట డినేంద్ర కుమార్ జన్మదిన సందర్భంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గూడూరు మండలం పాలిచర్ల గ్రామం నందు మనమడు చేత చెట్లు నటించారు. పెరుగతున్న కాలుష్యం మరియు జనసంఖ్య దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు తమ పరిధిలో అవకాశం వునచోట చెట్లు నాట్టి పర్యావరణ కాలుష్యం నివారణకు భాగస్వాములు కావాలని తెలియజేశారు.


# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



గూడూరు( సింధూరదర్శిని) 5 జూన్ నెల్లూరు జిల్లా ; ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలోని మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు పురపాలక సంఘము ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణం లోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. "ప్రకృతి నుంచి స్ఫూర్తి... వాతావరణం కోసం... మన భవిష్యత్తు కోసం" అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సోమశేఖర్( ఎఫ్ ఎ సి) శానిటరీ ఇన్స్పెక్టర్ , మునిసిపల్ మరియు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలను మరింత బలోపేతం చేసేందుకే ఆపరేషన్లు

రాపూరు (సింధూర దర్శిని) 5 జూన్ నెల్లూరు జిల్లా ; జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు రాపూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పంగిలి గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. రాపూరు సీఐ ఆధ్వర్యంలో ఎస్సైలు మరియు 15 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం గ్రామంలోని 25 మంది రెడ్ శాండర్స్ షీటర్ల నివాసాలను తనిఖీ చేసి వారి కదలికల పై వివరాలు సేకరించింది. తనిఖీలలో సరైన పత్రాలు లేని 15 మోటారు వాహనాలను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. అనంతరం గ్రామప్రజలు, యువతతో నిర్వహించిన అవగాహన సమావేశంలో సైబర్ మోసాలు, ఆన్‌లైన్ లోన్ యాప్ మోసాలు, మహిళల భద్రత, పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణ, పోలీస్ కంట్రోల్ రూమ్ 9392903413, డయల్-112, ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 మరియు సైబర్ హెల్ప్‌లైన్ 1930 వినియోగంపై అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్ట విరుద్ధ కార్యకలాపాల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని కోరు తూ, ప్రజల సహకారంతో జిల్లాలో శాంతిభద్రతలను మరింత బలోపే తం చేసేందుకు ఇటువంటి ఆపరేషన్లు నిరంతరం కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.



# ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్తు సురక్షితం

## ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం



తిరుపతి( సింధూర దర్శిని) 5 జూన్ తిరుపతి జిల్లా ; రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం లో భాగంగా పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యాన్ని కాపాడే అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎన్ టి ఆర్ జిల్లా మూలపాడు నుండి రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి కాపీలతీర్థం సమీపంలోని నగరవనంలో అధికారులు, విద్యార్థులు, వాకర్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ పవన్ కుమార్, ఎఫ్ ఆర్ ఓ లు సుదర్శన్ రెడ్డి, మాధవి, దాదాపు 100 మంది విద్యార్థులు, ఏపీ గ్రీన్ క్రాప్స్, గోపాల్స్ వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రకృతి ప్రేమికులు మరియు అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులు, విద్యార్థులు, వాకర్స్ పర్యావరణ పరిరక్షణ పై అవగాహన ర్యాలీ నిర్వహించడంతో పాటు విద్యార్థులు, సిబ్బంది, తదితరులు సీడ్ బాల్స్ తయారు చేశారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు, యువత పాత్రపై విద్యార్థులతో ఉప ముఖ్యమంత్రి ముచ్చటించారు. ఈ సందర్భంగా చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జీవ వైద్యాన్ని, పర్యావరణ పరిరక్షణ లో భాగంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు.

కార్యక్రమం నేపథ్యంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సీడ్ బాల్స్ తయారీ, వితరణ చేపట్టాలని సూచించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారు చేయాలని అందులో తిరుపతి జిల్లాలో 32.50 సీడ్ బాల్స్ లక్ష్యం నిర్దేశించడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు అటవీ శాఖ పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ మరియు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాలనే సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని, ఈ భారీ సీడ్ బాల్ కార్యక్రమం రాష్ట్రంలోని హరితావరణాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించనుందని తెలిపారు.



# ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం

ప్రధాన కార్యదర్శిగా జి. శంకరయ్య
ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవం
ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావు
అధ్యక్షులుగా కే .శేఖర్ రావు
ప్రధాన కార్యదర్శిగా జి. శంకరయ్య
ఉద్యోగుల సమస్యల పై నిజాయితీగా కృషి



అధ్యక్షులుగా కే.శేఖర్



ప్రధాన కార్యదర్శిగా జి.శంకరయ్య

గూడూరు (సింధూర దర్శిని) 5 జూన్ నెల్లూరు జిల్లా ; ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘము గూడూరు తాలూకా ఎన్నిక ఏకగ్రీవం. ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘము గూడూరు తాలూకా ఎన్నికలు, ఎన్నికల అధికారి వెంకటేశ్వరా రావు శుక్రవారం చెన్నూరు నందు నిర్వహించారు. ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రటించారు. అధ్యక్షులుగా కె.శేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జి. శంకరయ్య, సహ అధ్యక్షులుగా పవన్, సంయుక్త కార్యదర్శి డి. వెంకటేశ్వరరావు మరియు 15 మందితో మొత్తం కలిపి 19 మందితో గూడూరు తాలూకా ఏపీ జి ఈ ఏ ఎక్రీవంగా ఎన్నికయారు. ఈ ఎనికైనా కమిటీ సభ్యులు 3 సంవత్సరాలు పాటు చెల్లమనిలో ఉంటారని ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఏపీ జి ఈ ఏ జిల్లా అధ్యక్షులు పాల్గోని, ఈ సంఘము ఉద్యోగుల సమస్యల పై నీకార్సుగా నిజాయితీగా పని చేస్తుందని తెలిపారు. గెలిసిన సభ్యులకు శుభాకాంక్షలు , అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన: ఎమ్మెల్సీ మేరీగా మురళీధర్



గూడూరు ( సింధూర దర్శిని ) 5 జూన్ నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని సనత్ నగర్ ప్రాంతంలో ఉన్న గూడూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమంలో భాగంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబు ప్రభుత్వం ఘోరంగా విఫలమైన నేపథ్యంలో ప్రజలను మోసం చేస్తూ ప్రకటించిన మేనిఫెస్టో/ప్రజలకు ఇచ్చిన హామీ పత్రాలు వార్తా పత్రికల ద్వారా విడుదల చేసిన ప్రకటనల తాలూకు ప్రతులను వైసీపీ నాయకులతో కలిసి వైసీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ తగలబెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అబద్ధపు హామీలు, మోసపూరిత మాటలు చెప్పి గద్దెనెక్కి నేటికి రెండేళ్లు పూర్తయ్యాయి. చంద్రబాబు ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోంది ,ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదు ఎన్నికకు ముందు ప్రజలకు ఇచ్చిన బాండ్లు కేవలం చలి కాచుకోవడానికి తప్ప దేనికీ పనికిరావు కూటమి ప్రభుత్వం చేసిన మోసం ప్రజలకు ఇప్పుడు పూర్తిగా అర్థమైంది సాధారణంగా చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో ఎంతటి అసంతృప్తి, నిరసన ఉందో చెప్పడానికి మహిళలు సైతం స్వచ్ఛందంగా తరలివచ్చి చంద్రబాబు పాలనపై తమ అసంతృప్తిని, నిరసనను వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైంది కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఇలా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది ఎన్నికలకు ముందు పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రిస్తామని చెప్పిన చంద్రబాబు.. ఈరోజు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యధిక పెట్రోల్, డీజిల్ ధరలు ఉన్న రాష్ట్రంగా మార్చారు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలలో ఆంధ్ర రాష్ట్రం భారతదేశంలోనే మొదట స్థానం రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉందన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లేదు అన్నారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, మెట్ట రాధాకృష్ణారెడ్డి, ఊటుకూరు మహేంద్రరెడ్డి, ఊటుకూరు యామిని, పట్టణ నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.




# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉచిత విద్య

గూడూరు (సింధూర దర్శిని) 5 జూన్ నెల్లూరు జిల్లా ; గూడూరు రెండవ పట్టణంలోని శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం లైన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వైజేపీ, టౌన్, వెస్ట్ క్లబ్ లు సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న పేద విద్యార్థులకు ఈనెల ఒకటి నుండి 5వ తేదీ వరకు టాలెంట్ టెస్టులు నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఐఐటి, నీట్ మరియు ఒలంపియాడ్ కోర్సులతోపాటు ఉచిత విద్యను లయన్స్ క్లబ్ ద్వారా శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు అందించడం జరుగుతుందని క్లబ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ యాదవ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైజేపి,టౌన్ క్లబ్బుల ప్రెసిడెంట్లు బి.సుధాకర్, యం.శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి పి.గోపీనాథ్‌రెడ్డి, ట్రెజరర్ ప్రసాద్, సభ్యులు, రాజేంద్రప్రసాద్, ఇంతియాజ్, హరికృష్ణ, కావేరి తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థల బస్సులపై రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు

జిల్లా రవాణా శాఖ అధికారి
కొర్రపాటి మురళీమోహన్




తిరుపతి (సింధూర దర్శిని) 5 జూన్ తిరుపతి జిల్లా ; తిరుపతి నగర పరిధిలో విద్యా సంస్థలకు చెందిన బస్సులపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. విద్యా సంస్థల ప్రాంగణాల్లో ఈ తనిఖీలను ఆరు బృందాలుగా విభజించబడిన మోటార్ వాహన తనిఖీ అధికారులు నిర్వహించారు. ఇప్పటివరకు తిరుపతి జిల్లాలో సుమారు 850 విద్యాసంస్థల బస్సులను పరిశీలించగా, సాంకేతిక లోపాలు ఉన్న 75 వాహనాలకు నోటీసులు జారీ చేశారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు, మరమ్మత్తులు చేపట్టి వాహనాలను తిరిగి తనిఖీకి సమర్పించాలని సంబంధిత యాజమాన్యాలను ఆదేశించారు.మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 185(జీ) ప్రకారం పాఠశాల మరియు కళాశాల బస్సులకు వర్తించే అదనపు భద్రతా నిబంధనల కింద పేర్కొన్న 32 ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులు సూచించారు.పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అన్ని బస్సులు అవసరమైన మరమ్మత్తులు పూర్తి చేసి, ఫిట్నెస్ సర్టిఫికెట్ పునరుద్ధరించుకొని మాత్రమే రోడ్లపై నడపాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ సూచించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా మోటార్ వాహన చట్టాలు, నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు.తనిఖీల సందర్భంగా అధికారులు ముఖ్యంగా క్రింది అంశాలను పరిశీలించారు.

బస్సుల నిర్వహణ మరియు ఫిట్నెస్ స్థితి
పర్మిట్ మరియు పన్నుల చెల్లుబాటు
అత్యవసర నిర్గమ ద్వారాల ఏర్పాటు
వేగ నియంత్రణ పరికరాల అమరిక మరియు పనితీరు
అగ్నిమాపక పరికరాల లభ్యత, చెల్లుబాటు కాలం
డ్రైవర్ల లైసెన్సుల చెల్లుబాటు

విద్యార్థుల భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులు స్పష్టం చేశారు. విద్యా సంస్థల యాజమాన్యాలు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని, అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పేరెంట్స్ కమిటీలు ఏర్పాటు చేసుకొని పర్యవేక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు.భద్రతా ప్రమాణాలను పాటించకుండా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ తనిఖీలలో మోటార్ వాహన తనిఖీ అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికా నాజ్, మోహన్ కుమార్, ఆంజనేయ ప్రసాద్, రమణ నాయక్ మరియు జిల్లాలోని మోటర్ వాహన తనిఖీ అధికారులు అందరూ పాల్గొన్నారు.

# ఆర్డీవోగా అరుణకుమారి బాధ్యతలు



గూడూరు ( సింధూర దర్శిని) 5 జూన్ నెల్లూరు జిల్లా; గూడూరు నూతన ఆర్డీవోగా మందపాటి అరుణకుమారి శుక్రవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈమె గతంలో చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ప్రమోషన్ మీద గూడూరు ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# ఓడూర్‌లో వన్ మంత్ వన్ విలేజ్

చిల్లకూరు తాసిల్దార్
పెల్లకూరు గోపీనాథ్ రెడ్డి



గూడూరు ( సింధూర దర్శిని ) 5 జూన్ నెల్లూరు జిల్లా ; చిల్లకూరు మండల పరిధిలోని ఓడూరు గ్రామంలో వన్ మంత్ వన్ విలేజ్ కార్యక్రమాన్ని శుక్రవారం చిల్లకూరు తాసిల్దార్ పెల్లకూరు గోపీనాథ్ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ, వీఆర్వో భాస్కర్, నాయకులు గుండాల లీలావతి, కీరవాణి, శైలజమ్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

### ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలి

### శ్రీ అక్షర బిగ్ ప్రింట్స్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్



తిరుపతి (సింధూర దర్శిని) 5 జూన్ తిరుపతి జిల్లా ; కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఎంఎస్ఎంఈ పథకాలను యువత సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద "వన్ ఫ్యామిలీ – వన్ ఎంటర్‌ప్రెన్యూర్" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శ్రీ అక్షర బిగ్ ప్రింట్స్‌ను శుక్రవారం ఉదయం కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ప్రభుత్వ పథకాల సహకారంతో స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంఎస్ఎంఈ రంగం ద్వారా ఉపాధి పొందడమే కాకుండా ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగవచ్చున్నారు. శ్రీ అక్షర బిగ్ ప్రింట్స్‌లో జపాన్ సాంకేతికతతో కూడిన ఆధునిక పరికరాలు, అంతర్జాతీయ ప్రమాణాల రంగులను ఉపయోగించి నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్నారని కలెక్టర్ అభినందించారు. ఇటువంటి పరిశ్రమలు యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. బిగ్ ప్రింట్స్ సంస్థ అధినేత, హరిబాబు మద్దినేని మాట్లాడుతూ, "వన్ ఫ్యామిలీ – వన్ ఎంటర్‌ప్రెన్యూర్" కార్యక్రమంలో భాగంగానే శ్రీ అక్షర బిగ్ ప్రింట్స్‌ను స్థాపించినట్లు ఈ సంస్థ నుండి అన్ని రకాల ప్రింటింగ్ ఉత్పత్తులు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ సంస్థను సందర్శించడం ఆనందంగా ఉందని, ఈ సంస్థ ద్వారా తనతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించగలగడం సంతోషకరమని పేర్కొన్నారు.

# సైబర్ సెక్యూరిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాం విజయవంతం




గూడూరు ( సింధూర దర్శిని ) 5 జూన్ నెల్లూరు జిల్లా ; ఆదిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీలో అధ్యాపకుల కోసం నిర్వహించిన ఏ .ఐ టూల్స్ డెవలప్‌మెంట్ , సైబర్ సెక్యూరిటీ" అంశాలపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శుక్రవారం విజయవంతంగా ముగిసింది. జూన్ 1 నుండి 5 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, ఇండియన్ సర్వర్స్ సంస్థ వ్యవస్థాపకుడు మరియు సీఈఓ శ్రీ సాయి సతీష్ వనరుల వ్యక్తిగా వ్యవహరించారు. ఐదు రోజుల పాటు కృత్రిమ మేధస్సు సాధనాలు, ఏ.ఐ .ఆధారిత కంటెంట్ తయారీ, ఆటోమేషన్ టెక్నాలజీలు, సైబర్ సెక్యూరిటీ మౌలికాంశాలు, సైబర్ దాడుల నివారణ, సురక్షిత డిజిటల్ పద్ధతులు, విద్యారంగంలో ఏ.ఐ వినియోగం తదితర అంశాలపై ఆయన సమగ్రంగా శిక్షణ అందించారు. అనంతరం యూనివర్సిటీ డీన్ డా. కె. ధనుంజయ మాట్లాడుతూ, అధ్యాపకులకు అత్యంత ఉపయోగకరమైన శిక్షణను అందించిన శ్రీ సాయి సతీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను బోధనలో ఉపయోగించి విద్యార్థులకు మరింత స్పష్టతతో కూడిన అభ్యాసాన్ని అందించాలని అధ్యాపకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాజయ్య, డిప్యూటీ రిజిస్ట్రార్ రామయ్య, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు ఆర్డీవోని కలిసిన చిల్లకూరు తాసిల్దార్



గూడూరు (సింధూర దర్శిని) 5 జూన్ నెల్లూరు జిల్లా ; గూడూరు ఆర్డీవో అరుణ కుమారి నూతన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చిల్లకూరు తాసిల్దార్ పెళ్లకూరు గోపీనాథ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ జ్యోతి, ఆర్ ఐ పూర్ణచంద్ ,విఆర్వోలు రమణయ్య, శ్రీనివాసులు , ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలి


### ఆలయ ఈవో పెంచల కిషోర్

కాణిపాకం ( సింధూర దర్శిని) 5 జూన్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం నందు శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా వినాయక సదన్ వసతి సముదాయము, 100 అడుగుల రోడ్డు నందు దేవస్థానం చైర్మన్ మణి నాయుడు , మరియు దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ మొక్కలు నాటడం జరిగింది, ఇందులో భాగంగా పర్యావరణాన్ని పరిరక్షించడంలో దేవస్థానం సిబ్బంది అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో ఏ.ఈ లు అరవింద్, శివాంజనేయులు, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గతంలో త్రిషపై వ్యాఖ్యలు చేసిన పార్తిబన్... సీఎం విజయ్‌ని కలిశాడు!

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో నటుడు పార్తిబన్ భేటీ
ప్రత్యేక పెయింటింగ్, అభినందిస్తూ లేఖ ఇచ్చిన పార్తిబన్
నటి త్రిషపై వ్యాఖ్యల వివాదం తర్వాత తొలిసారిగా సమావేశం
విజయ్‌ను 'చక్రవర్తి'గా అభివర్ణించిన పార్తిబన్
పార్తిబన్ వ్యాఖ్యలపై గతంలో ఘాటుగా స్పందించిన త్రిష



ప్రముఖ నటుడు, దర్శకుడు ఆర్. పార్తిబన్ తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌ను అభినందిస్తూ స్వహస్తాలతో రాసిన లేఖతో పాటు, ప్రత్యేకంగా రూపొందించిన ఒక పెయింటింగ్‌ను ఆయనకు బహూకరించారు. నటి త్రిష కృష్ణన్‌పై పార్తిబన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కొద్ది నెలలకే ఈ భేటీ జరగడం రాజకీయ, సినీ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కలయికకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. విజయ్ సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఎందరికో స్ఫూర్తిదాయకమని పార్తిబన్ తన లేఖలో ప్రశంసించారు. ఆయన బహూకరించిన చిత్రపటంలో విజయ్ ఒక సింహాసనం పక్కన రాజసం ఉట్టిపడే వస్త్రధారణతో నిల్చుని ఉన్నారు. ఈ భేటీ సందర్భంగా విజయ్‌ను పార్తిబన్ 'చక్రవర్తి' అని సంబోధించారు.

గత మార్చిలో జరిగిన ఒక కార్యక్రమంలో త్రిష ఫొటోను చూసిన పార్తిబన్, "ఈ కుందవైని కొన్ని రోజులు ఇంట్లోనే ఉంచాలి, బయటకు రానివ్వకూడదు" అంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. విమర్శలు వెల్లువెత్తడంతో ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా క్షమాపణలు కోరారు. దీనిపై త్రిష సైతం ఘాటుగా స్పందిస్తూ, "మైక్ దొరికినప్పుడల్లా మాట్లాడే ప్రతి మాటా తెలివైనది కాదని, అది ఒక్కోసారి మన మూర్ఖత్వానికి నిదర్శనం" అని 'ఎక్స్' వేదికగా బదులిచ్చారు.



## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

### టిడిపి రాష్ట్ర కార్యదర్శి , కందుకూరు అబ్జర్వర్ మట్టం శ్రావణి రెడ్డి

గూడూరు ( సింధూర దర్శిని ) 5 జూన్ నెల్లూరు జిల్లా ; గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు -2 సచివాలయ ఆవరణంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి , కందుకూరు నియోజకర్గ పరిశీలకులు మట్టం శ్రావణి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని , మొక్కలను నాటారు. ఈ సందర్భంగా శ్రావణి రెడ్డి మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ ఎంతో ముఖ్యమని చెట్లు తగ్గిపోతూ ఉన్నాయని కొన్ని సంవత్సరాలకి మానవ మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరు బాధ్యత

### ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి. లెనిన్ బాబు



తిరుపతి( సింధూర దర్శిని) 5 జూన్ తిరుపతి జిల్లా ; పర్యావరణం ప్రతి ఒక్కరి బాధ్యత... ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.లెనిన్ బాబు శుక్రవారం కోర్టు సముదాయంలో ఉన్న ప్రత్యేక సబ్ జైల్ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా జడ్జి పాల్గొనడం జరిగినది. ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక చెట్టును నాటడం అలవాటుగా చేసుకోవాలని, దాని ద్వారా మన ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. పర్యావరణం బాగుంటుందని, పర్యావరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మంచి అలవాటుగా అలవర్చుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు చెట్లు నాటడం తో పాటు, ఆ మొక్కలని ప్రతిరోజు నీరు పోసి పెద్దవి అయ్యేవిధంగా చూసుకోవాలని తెలియజేశారు. వాహనాల నుండి వచ్చే వాయువులను కూడా ఇది నివారిస్తుందని తెలియజేశారు. సబ్ జైల్లో మొక్కలను నాటి, ఖైదీలతో వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్ లోపల సందర్శించారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ పాల్గొన్నారు.

## భక్తులకు నాణ్యమైన లడ్డు అందించాలి

### లడ్డు పోటు ను పరిశీలించిన ఆలయ ఛైర్మన్ మణి, ఆలయ ఈవో పెంచల కిషోర్



కాణిపాకం (సింధూర దర్శిని) 5 జూన్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం లడ్డు పోటు నందు లడ్డు నాణ్యత పరిశీలించిన దేవస్థానం చైర్మన్ మణి నాయుడు ఈ.వో పెంచల కిషోర్ భక్తులకు నాణ్యమైన, రుచికరమైన, లడ్డు ప్రసాదాన్ని అందజేయాలని సిబ్బందికి మరియు కాంట్రాక్టర్ కి సూచించారు, నాణ్యత లోపిస్తే చర్యలు చేపడతామని తెలియజేశారు,

## వికలాంగులకు నిత్యవసర సరుకులు పంపిణీ

గూడూరు (సింధూర దర్శిని ) 5 జూన్ నెల్లూరు జిల్లా; స్థానిక త్యాగరాజా వీధిలోనిలోని శ్రీ కళ్యాణవీరభద్ర స్వామి దేవస్థానములో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ , ఆంధ్రమహిళా మండలివారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికీ ముఖ్య అతిథిగా డాక్టర్ రోహినమ్మ వ్యవహరింాచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలోమాధురి, లక్ష్మీ, జీవని, నిర్మల, సుప్రజ, సుప్రియ, సభ్యులు జానా సుధీర్ ,పల్లం వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ కరెన్సీ నోట్లపై ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా క్లారిటీ!

**ప్లాస్టిక్ కరెన్సీ చలామణిలోకి రాబోతోందంటూ ప్రచారం**

**ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్న మాట నిజమేనన్న ఆర్బీఐ గవర్నర్**

**2014లో పార్లమెంటులో ప్లాస్టిక్ నోట్ల ప్రస్తావన**




భారతదేశంలో త్వరలోనే పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లు చలామణిలోకి రాబోతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టతనిచ్చారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్న మాట వాస్తవమేనని, అయితే ఇది ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆయన పేర్కొన్నారు. దేశంలో పేపర్ కరెన్సీ వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, ప్లాస్టిక్ నోట్లను తీసుకురావడానికి గల సాధ్యాసాధ్యాలపై ఆర్‌బీఐ కసరత్తు చేస్తోంది. కాగితపు నోట్ల ముద్రణకు భారీగా ఖర్చు అవ్వడం, అవి త్వరగా పాడైపోయి చలామణి నుంచి తొలగించాల్సి రావడం వంటి కారణాల వల్లే ఈ ప్రత్యామ్నాయంపై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్లాస్టిక్ నోట్ల వల్ల కలిగే ప్రయోజనాలు, వాటి వల్ల భవిష్యత్తులో ఎదు రయ్యే సాంకేతిక, ఆపరేషనల్ సమస్యలపై ఆర్బీఐ నిపుణులు అధ్యయనం చేస్తున్నారు.

నిజానికి, ప్లాస్టిక్ నోట్ల ప్రస్తావన ఈనాటిది కాదు. 2014 ఫిబ్రవరిలోనే కేంద్ర ప్రభుత్వం దీనిపై పార్లమెంటుకు సమాచారం అందించింది. భౌగోళిక, వాతావరణ వైవిధ్యాలను పరీక్షించడానికి దేశవ్యాప్తంగా ఐదు నగరాలను (కొచ్చి, మైసూర్, జైపూర్, సిమ్లా, భువనేశ్వర్) ఎంపిక చేశారు.

ఆయా ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా రూ. 100 కోట్ల విలువైన ప్లాస్టిక్ నోట్లను ప్రవేశ పెట్టాలని భావించారు. కానీ, అప్పట్లో కొన్ని సాంకేతిక, నిర్వహణ లోపాల వల్ల ఈ ప్రాజెక్టు తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇప్పుడు ఆర్‌బీఐ మళ్లీ ఈ ఫైల్‌ను కదిలించడంతో త్వరలోనే దేశంలో ప్లాస్టిక్ నోట్లు అందుబాటులోకి వస్తాయనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

# అద్భుత ఆవిష్కరణ.. ఇక గోడలకు మేకులు, డ్రిల్లింగ్‌తో పనిలేదు!

**గోడలకు మేకులు కొట్టకుండా వస్తువులు తగిలించే సరికొత్త టెక్నాలజీ**

**అర్జెంటీనాకు చెందిన మార్కో అగస్టిన్ సెక్కీ ఆవిష్కరణ 'ఐరన్‌ప్లాక్'**

**ప్రత్యేక సిమెంట్ మిశ్రమంతో గోడలకు అయస్కాంత శక్తి**

**ఇంటి అలంకరణ, వస్తువుల అమరిక మరింత సులభతరం**

**ప్రస్తుతం పైలట్ టెస్టింగ్ దశలో ఉన్న ఈ ఆవిష్కరణ**



ఇంటి గోడలకు మేకులు కొట్టడం, డ్రిల్లింగ్ చేయడం సర్వసాధారణం. అయితే దీనివల్ల గోడల అందం దెబ్బతింటుందని, మరమ్మతులు చేయాల్సి వస్తుందని చాలామంది భావిస్తుంటారు. ఈ సమస్యకు పరిష్కారంగా అర్జెంటీనాకు చెందిన ఓ యువ ఆవిష్కర్త సరికొత్త టెక్నాలజీని అభివృద్ధి చేశాడు. 'ఐరన్‌ప్లాక్' పేరుతో అతడు రూపొందించిన ప్రత్యేక మిశ్రమంతో, ఇకపై గోడలకు మేకులు, స్క్రూలు లేకుండానే వస్తువులను సులభంగా తగిలించుకోవచ్చు. అర్జెంటీనాకు చెందిన 29 ఏళ్ల మార్కో అగస్టిన్ సెక్కీ ఈ వినూత్న ఆవిష్కరణ చేశాడు. ఐరన్‌ప్లాక్ అనేది ఒక ప్రత్యేకమైన సిమెంట్ లేదా ప్లాస్టర్ మిశ్రమం. ఇందులో కొన్ని ఖనిజాలు, ఇనుము సంబంధిత పదార్థాలను కలుపుతారు.

ఈ మిశ్రమంతో గోడకు పూత వేసినప్పుడు, ఆ గోడ ఒక మాగ్నెటిక్ ఉపరితలంలా పనిచేస్తుంది. దీనికి విద్యుత్ అవసరం లేదు. ఫ్రిజ్ డోర్‌కు అయస్కాంతాలు ఎలా అంటుకుంటాయో, అదే విధంగా ఈ గోడలకు కూడా అయస్కాంతాలు ఉన్న వస్తువులు అతుక్కుంటాయి. ఈ టెక్నాలజీతో ఫొటో ఫ్రేమ్‌లు, అద్దాలు, పనిముట్లు, చిన్న షెల్ఫ్‌ల వంటి వాటిని గోడలకు ఎలాంటి నష్టం కలగకుండా అమర్చుకోవచ్చు. వాటి స్థానాన్ని మార్చాలనుకుంటే సులభంగా తీసి మరోచోట పెట్టుకోవచ్చు. ముఖ్యంగా అద్దె ఇళ్లలో ఉండేవారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ఈ టెక్నాలజీ పైలట్ టెస్టింగ్ దశలో ఉంది. అంతర్జాతీయ పేటెంట్ కోసం దరఖాస్తు చేశారు. ఇది ఎంత బరువును మోయగలదు, ఎంతకాలం మన్నుతుంది అనే అంశాలపై పూర్తిస్థాయి పరీక్షలు జరగాల్సి ఉంది. ఈ ఆవిష్కరణ విజయవంతమైతే నిర్మాణ, ఇంటీరియర్ డిజైనింగ్ రంగాలలో ఇది విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉంది.

# 80ఏళ్ల చిక్కుముడిని ఇట్టే విప్పేసిన ఏఐ!

**80 ఏళ్ల నాటి క్లిష్టమైన గణిత సమస్యను ఛేదించిన ఓపెన్‌ఏఐ- పాల్ ఎర్డోస్ విసిరిన 'ప్లానార్ యూనిట్ డిస్టెన్స్' సవాల్‌కు సమాధానం**

**పాత అంచనాలను తప్పు అని నిరూపిస్తూ సరికొత్త పరిష్కారం - గణితంలో ఏఐ సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలికిన ఘటన**

**ప్రముఖ గణిత శాస్త్రవేత్తలు సైతం ధ్రువీకరించిన ఏఐ ఫలితం**



టెక్నాలజీ ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మరో సంచలనం సృష్టించింది. దాదాపు 80 ఏళ్లుగా గణిత మేధావులకు సవాల్‌గా నిలిచిన ఓ క్లిష్టమైన సమస్యను ఓపెన్‌ఏఐ అభివృద్ధి చేసిన ఏఐ మోడల్ ఛేదించింది. 1946లో ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త పాల్ ఎర్డోస్ ప్రతిపాదించిన 'ప్లానార్ యూనిట్ డిస్టెన్స్ ప్రాబ్లమ్'కు ఈ ఏఐ ఊహించని పరిష్కారం కనుగొంది.

**ఏమిటీ సమస్య?**

ఒక కాగితం లాంటి సమతలంపై కొన్ని పాయింట్లను ఉంచినప్పుడు, వాటిలో గరిష్ఠంగా ఎన్ని జతల పాయింట్లు కచ్చితంగా ఒక యూనిట్ దూరంలో ఉంటాయనేది ఈ సమస్య సారాంశం. ఇప్పటివరకు చతురస్రాకార గ్రిడ్ తరహా అమరిక ఉత్తమమని భావించినా, దానిని కచ్చితంగా నిరూపించలేకపోయారు. అయితే, ఓపెన్‌ఏఐ మోడల్ ఈ పాత అంచనాలను తప్పు అని నిరూపిస్తూ, అంతకంటే మెరుగైన ఫలితాలనిచ్చే సరికొత్త నిర్మాణాన్ని ఆవిష్కరించింది.

**ఏఐ ఎలా సాధించింది?**

ఈ సమస్యను పరిష్కరించేందుకు ఏఐ అనుసరించిన విధానం శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరిచింది. గణితంలోని జ్యామెట్రీ సమస్యకు, ఆల్జీబ్రా, నంబర్ థియరీ వంటి సంబంధం లేదనుకున్న రంగాలను అనుసంధానించి ఈ ఏఐ ఒక కొత్త పరిష్కారాన్ని రూపొందించింది. మానవ నిపుణులు దశాబ్దాలుగా గుర్తించని ఈ కొత్త విధానం, ఏఐలోని అధునాతన తార్కిక సామర్థ్యాలకు నిదర్శనమని నిపుణులు చెబుతున్నారు. ఈ ఫలితాన్ని టిమ్ గోవర్స్ వంటి ప్రముఖ గణిత శాస్త్రవేత్తలు ధృవీకరించారు.

ఈ విజయం ఏఐ పరిశోధనలో ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. గణితంతో పాటు భౌతిక, జీవ, ఇంజినీరింగ్ శాస్త్రాల్లో క్లిష్టమైన సమస్యల పరిష్కారానికి ఏఐని ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగించుకోవచ్చని ఈ ఘటన రుజువు చేస్తోంది. అయితే, ఏఐ ఇప్పటికీ మానవ పర్యవేక్షణ లేకుండా స్వతంత్రంగా పనిచేయలేదని, దాని ఫలితాలను నిపుణులు ధృవీకరించడం తప్పనిసరి అని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు.

# ఈ 5 సముద్రపు పాములు వెరీ డేంజర్!

**పసిఫిక్, ఇండో-పసిఫిక్ సముద్రాల్లో విషపూరిత పాములపై అలర్ట్ - ఎల్లో-బెల్లీడ్, డ్యుబోయిస్ వంటి అత్యంత విషపూరిత జాతులపై అవగాహన**

**పాములు రెచ్చగొడితేే తప్ప దాడి చేయవని, దూరంగా ఉండాలని సూచన - పాముకాటుకు గురైతే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని విజ్ఞప్తి**



వెకేషన్ కోసం హవాయి, గువాం వంటి పసిఫిక్, ఇండో-పసిఫిక్ ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో, సముద్రంలో స్నార్కెలింగ్, డైవింగ్ చేసేవారు అత్యంత విషపూరితమైన సముద్ర పాముల పట్ల అప్రమత్తంగా ఉండాలని సముద్ర జీవశాస్త్ర నిపుణులు హెచ్చరిస్తున్నారు. సముద్ర పాము కాట్లు అరుదుగా సంభవించినప్పటికీ, వాటి విషం నేరుగా నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని, అందుకే తగిన జాగ్రత్తలు పాటించాలని వారు సూచిస్తున్నారు. వీటిలో ప్రధానంగా 'ఎల్లో-బెల్లీడ్ సీ స్నేక్' ఒకటి. ఇది హవాయి, కాలిఫోర్నియా తీరాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అలాగే, ప్రపంచంలోనే అత్యంత విషపూరితమైన పాములలో ఒకటైన 'డ్యుబోయిస్ సీ స్నేక్' ఇండో-పసిఫిక్‌లోని పగడపు దిబ్బలలో నివసిస్తుంది. వీటితో పాటు ఎల్లో-లిప్డ్ సీ క్రైట్, ఆలివ్ సీ స్నేక్, బ్లూ లిప్డ్ సీ క్రైట్ వంటి ఇతర జాతులు కూడా ఈ ప్రాంతాల్లో సంచరిస్తుంటాయి. అయితే, సముద్ర పాములు సాధారణంగా రెచ్చగొడితే తప్ప మనుషులపై దాడి చేయవని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మత్స్యకారుల వలల్లో చిక్కుకున్నప్పుడు లేదా వాటిని పట్టుకోవడానికి ప్రయత్నించినప్పుడు మాత్రమే కాటు వేసే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. పర్యాటకులు సముద్ర పాములను చూసినప్పుడు వాటికి దూరంగా ఉండాలని, వాటిని తాకడానికి ప్రయత్నించవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ పొరపాటున పాముకాటుకు గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే అత్యవసర వైద్య సహాయం తీసుకోవాలని వారు హెచ్చరించారు.

# చిన్నారి కడుపులో తన్నిన రోబో.. నొప్పితో విలవిల్లాడిన బాలుడు

**చైనా బొటానికల్ గార్డెన్‌లో రోబో ప్రదర్శనలో అపశ్రుతి - మార్షల్ ఆర్ట్స్ విన్యాసంలో భాగంగా బాలుడిని కాలితో తన్నిన రోబో**

**ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్**

**రోబోల భద్రత, యంత్రాలు తప్పు చేస్తే బాధ్యత ఎవరిదనే దానిపై తీవ్ర చర్చ**

**నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని నెటిజన్ల విమర్శలు**



చైనాలోని ఓ బొటానికల్ గార్డెన్‌లో జరిగిన ఓ సంఘటన ఇప్పుడు రోబోల భద్రతపై తీవ్ర చర్చకు దారితీసింది. వినోదం కోసం ఏర్పాటు చేసిన ఓ హ్యూమనాయిడ్ రోబో ప్రదర్శన ఇస్తుండగా, అకస్మాత్తుగా ఓ చిన్నారిని కాలితో తన్నడంతో ఈ వివాదం మొదలైంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, యంత్రాలతో వ్యవహరించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. చైనాలోని జిన్‌జియాంగ్ ప్రాంతంలో ఉన్న ఉరుమ్కి బొటానికల్ గార్డెన్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వైరల్ వీడియో ప్రకారం, ఆఫ్రో స్టైల్ విగ్గు ధరించిన ఓ రోబో మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు చేస్తోంది. చుట్టూ ఉన్న చిన్నారులు, పెద్దలు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ క్రమంలో, ఆ రోబో వేగంగా తిరిగి ఒక రౌండ్‌హౌస్ కిక్ ఇచ్చింది. సరిగ్గా అదే సమయంలో దానికి దగ్గరగా నిల్చుని చూస్తున్న ఓ బాలుడి పొట్టలో ఆ కిక్ బలంగా తగిలింది. దీంతో ఆ బాలుడు నొప్పితో విలవిలలాడిపోయాడు. వెంటనే పక్కనున్న మరో బాలుడు అతడిని వెనక్కి లాగాడు. ఈ ఘటనతో అక్కడున్న వారంతా షాక్‌కు గురయ్యారు. అయితే, బాలుడికి తీవ్ర గాయాలేమీ కాలేదని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ వీడియో ఆన్‌లైన్‌లో విస్తృతంగా వ్యాపించడంతో, నెటిజన్ల నుంచి భిన్నమైన స్పందనలు వస్తున్నాయి. ముఖ్యంగా 'యంత్రం తప్పు చేస్తే దానికి బాధ్యులు ఎవరు?' అనే ప్రాథమిక ప్రశ్నను చాలామంది లేవనెత్తారు. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హింసకు పాల్పడే టెర్మినేటర్ తరహా దృశ్యం కాదని, కేవలం భద్రతా ప్రమాణాలను విస్మరించడమే అసలైన సమస్య అని కొందరు అభిప్రాయపడ్డారు. "శక్తివంతమైన యంత్రాలను ఎలాంటి భౌతిక అడ్డంకులు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శించడం నిర్వాహకుల నిర్లక్ష్యమే" అని ఒకరు వ్యాఖ్యానించారు. "ఇది ఏఐ రోబో కాదు, మనిషి నియంత్రించేది. ప్రదర్శన ప్రాంతానికి, ప్రేక్షకులకు మధ్య సరైన బారికేడ్లు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగింది" అని మరో వ్యక్తి పేర్కొన్నారు. మరికొందరు మాత్రం, బాలుడు గాయపడినా అందరూ రోబోనే చూస్తుండిపోయారని, మానవత్వం ఎక్కడికి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ప్రమాదవశాత్తు జరిగిందని, రోబో తన నిర్దేశిత కదలికలు చేస్తుండగా బాలుడు అడ్డుగా వచ్చాడని మరికొందరు వాదించారు. మొత్తానికి ఈ ఘటన, సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ మానవ భద్రతకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతను మరోసారి గుర్తుచేసింది.

# పీహెచ్సీలను తనిఖీ చేసిన డిఎంహెచ్వో



బద్వేల్, సింధూరదర్శిని: బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రం సురేంద్ర నగర్ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము తొట్టిగారిపల్లి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు సందర్శించి ఆరోగ్య కేంద్రం లో జరుగు కార్యక్రమంలో అన్నీ కూడా పర్యవేక్షించడం అయినది ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యం మరియు ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు మాట్లాడుతూ హాస్పిటల్లో పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదేవిధంగా స్టాఫ్ అందరు సమయపాలన పాటించి, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ నమోదు చేసి ప్రతి ఒక్కరికి అభ ఐడి క్రియేట్ చేసి సంక్రమణ అసంక్రమణకు సంబంధించిన సర్వే పక్కాగా జరిగింది 14 నుంచి 15 సంవత్సరాల బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్ చేయవలసినదిగా ఆదేశాలించడమైనది.

హాస్పిటల్‌కి వచ్చి ప్రజలను స్నేహ పూర్వకంగా రిసీవ్ చేసుకుని వారికి సరైన వైద్యం అందించి మెడికల్ ఆఫీసర్స్‌కు ఆదేశాలు ఇవ్వడమైనది కార్యక్రమంలో ఉప జిల్లావైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మల్లేష్ ఆర్ వి ఎస్ కే కోఆర్డినేటర్ డాక్టర్ అర్ఫి ఎపిడమాలజిస్ట్ ఖాజా వైద్యులు శ్రీనివాసులు శరత్చంద్ర శశివర్ధన్‌రెడ్డి డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్యలు పాల్గొనడం జరిగింది.

# విజయవాడ నుంచి వారణాసికి నేరుగా విమానం... టికెట్ ధర ఎంతంటే!

**విజయవాడ నుంచి వారణాసికి ఆగస్టు 13 నుంచి ఇండిగో విమాన సర్వీసు – వారానికి మూడు రోజులు అందుబాటులో ఉండనున్న కొత్త విమానం**

**ఏపీలో విమానయాన రంగానికి కొత్త పాలసీని ప్రకటించిన ప్రభుత్వం – రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాలు, హెలిపోర్ట్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు**

**ఏరోస్పేస్ తయారీలో రూ.9,575 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం**

విజయవాడ, సింధూరదర్శిని: ఏపీ ప్రభుత్వం రాజధాని అమరావతికి కనెక్టివిటీని పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశంలోని పలు నగరాలకు కొత్త సర్వీసులను అందుబాటులోకి తెస్తోంది. తాజాగా పుణ్యక్షేత్రమైన వారణాసికి విజయవాడ నుంచి నేరుగా విమాన సర్వీసును ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో ఈ సర్వీసును నడిపేందుకు ముందుకు వచ్చింది. ఈ కొత్త విమాన సర్వీసు ఆగస్టు 13వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఇండిగో సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే టికెట్ల బుకింగ్స్ కూడా ప్రారంభమయ్యాయి. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఈ సర్వీసు అందుబాటులో ఉంటుంది. ప్రతిరోజూ మధ్యాహ్నం 3:55 గంటలకు వారణాసిలో బయలుదేరిన విమానం, సాయంత్రం 5:50 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం 6:20 గంటలకు విజయవాడలో బయలుదేరి రాత్రి 8:15 గంటలకు వారణాసికి చేరుకుంటుంది. ప్రయాణ టికెట్ ధర సుమారు రూ.6,500 నుంచి రూ.8,000 మధ్య



ఉంటుందని అంచనా.

**కొత్త ఏవియేషన్ పాలసీతో భారీ లక్ష్యాలు**

ఈ కొత్త సర్వీసు, రాష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగంపై పెడుతున్న ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇటీవల ఏపీ ప్రభుత్వం 2026 నుంచి 2031 వరకు అమల్లో ఉండేలా నూతన ఏవియేషన్ పాలసీని ప్రకటించింది. ఈ పాలసీ ద్వారా విమానయాన రంగంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకుంది. 2030 నాటికి ఏరోస్పేస్ తయారీ రంగంలో సుమారు రూ.9,575 కోట్లకు (1 బిలియన్ డాలర్లు) పైగా పెట్టుబడులను సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీంతో పాటు ఎంఆర్‌వో (వీ=హా), ఏరోస్పేస్ తయారీ రంగాల్లో ఏటా 5 వేల మందికి నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది.

**రాష్ట్రవ్యాప్తంగా విమానయాన నెట్‌వర్క్ విస్తరణ**

ఈ పాలసీలో భాగంగా రాష్ట్రంలో విమానయాన నెట్‌వర్క్‌ను సమూలంగా విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అమరావతి విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయడంతో పాటు, దగదర్తి, కుప్పం, శ్రీకాకుళం, నాగార్జునసాగర్, అనంతపురం వంటి ప్రాంతాల్లో కొత్త విమానాశ్రయాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో ప్రతి 150 కిలోమీటర్ల పరిధిలో ఒక విమానాశ్రయం, 7 లో-కాస్ట్ విమానాశ్రయాలు, 10కి పైగా వాటర్‌డ్రోమ్స్, హెలిపోర్ట్‌ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్రంలోని ప్రధాన విమానాశ్రయాల నుంచి దేశంలోని 25కు పైగా ప్రాంతాలకు, 10కి పైగా అంతర్జాతీయ గమ్యస్థానాలకు కనెక్టివిటీని పెంచడం ద్వారా రాష్ట్రాన్ని కీలకమైన ఏవియేషన్ హబ్‌గా మార్చాలని ప్రభుత్వం భావిస్తోంది.

# బీజేపీని వీడిన అన్నామలై... స్పందించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు

**అన్నామలై రాజీనామాకు బీజేపీ ఆమోద ముద్ర – అన్నామలై నిష్క్రమణతో పార్టీకి ఎలాంటి నష్టం లేదన్న తమిళనాడు బీజేపీ**

**వ్యక్తుల కంటే పార్టీ సిద్ధాంతాలే ముఖ్యమని నైనార్ నాగేంద్రన్ వ్యాఖ్య**

**పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే చర్యలు కొనసాగుతాయని వెల్లడి**

తమిళనాడు బీజేపీ కీలక నేత, మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై రాజీనామాను బీజేపీ అధిష్ఠానం ఆమోదించింది. త్వరలోనే సొంత రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి, రాబోయే ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు అన్నామలై ప్రకటించారు. అన్నామలై రాజీనామాకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఇవాళ ఆమోద ముద్ర వేశారు. ఈ పరిణామంపై తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ స్పందించారు. అన్నామలై రాజీనామా వల్ల పార్టీకి ఎలాంటి నష్టంలేదని ఆయన వ్యాఖ్యానించారు. వ్యక్తుల కంటే పార్టీ సిద్ధాంతాలే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే చర్యలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.

మాజీ ఐపీఎస్ అధికారి అయిన అన్నామలై 2020లో బీజేపీలో చేరి, 2025 ఏప్రిల్ వరకు రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత ఆయన స్థానంలో



నాగేంద్రన్ నియమితులయ్యారు. "బీజేపీ సభ్యుడిగా, ఒక తమిళుడిగా నా గుర్తింపునకు మధ్య అంతర్గత సంఘర్షణ నెలకొంది. అందుకే నేడు ఒక నూతన ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నాం. మా రాజకీయ పార్టీ రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుంది" అని అన్నామలై స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకున్న బీజేపీ కేవలం 3 శాతం ఓట్లకే పరిమితమైంది. అయితే, అన్నామలై నేతృత్వంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ 11 శాతం ఓట్లు సాధించినప్పటికీ, ఒక్క సీటును కూడా గెలుచుకోలేకపోయింది. వాస్తవానికి, 2025 డిసెంబర్‌లోనే పార్టీని వీడాలన్న తన ఉద్దేశాన్ని అధిష్ఠానానికి వివరించానని, అయితే ఎన్నికల వరకు వేచి ఉండాలని కోరడంతోనే ఇన్నాళ్లూ కొనసాగానని అన్నామలై వివరించారు.

# శ్రీలంక చేరుకున్న తిలక్ వర్మ, వైభవ్ సూర్యవంశీ, ఇతర ఆటగాళ్లు

**ముక్కోణపు వన్డే సిరీస్ కోసం శ్రీలంక వెళ్లిన భారత 'ఏ' జట్టు**

**– తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరించనున్న ఈ జట్టులో రుతురాజ్ గైక్వాడ్ వైస్ కెప్టెన్**

**జూన్ 9 నుంచి 21 వరకు దంబుల్లా వేదికగా టోర్నీ – భారత్, శ్రీలంక, ఆఫ్ఘనిస్థాన్ దేశాల 'ఏ' జట్లతో టోర్నీ**

**గాయం కారణంగా రియాన్ పరాగ్ సిరీస్‌కు దూరం**



శ్రీలంకలో జరగనున్న 50 ఓవర్ల ముక్కోణపు సిరీస్ కోసం తిలక్ వర్మ సారథ్యంలోని భారత 'ఏ' జట్టు లంక గడ్డపై అడుగుపెట్టింది. జూన్ 9 నుంచి 21 వరకు దంబుల్లాలోని రంగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ సిరీస్‌లో భారత్‌తో పాటు ఆతిథ్య శ్రీలంక 'ఏ', ఆఫ్ఘనిస్థాన్ 'ఏ' జట్లు తలపడనున్నాయి. ఈ టోర్నీలో ప్రధానంగా భారత చిచ్చరపిడుగు, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాడు. ఇటీవలే ముగిసిన ఐపీఎల్ లో వైభవ్ పరుగుల మోత మోగించిన సంగతి తెలిసిందే. భారత జట్టు శ్రీలంక చేరుకున్న విషయాన్ని ఆ దేశ క్రికెట్ బోర్డు (ఎస్ఎల్ సీ) సోషల్ మీడియా ద్వారా ధృవీకరించింది. తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, వైభవ్ సూర్యవంశీ వంటి ఆటగాళ్లు శ్రీలంక చేరుకున్న ఫొటోలను పంచుకుంది. "భారత 'ఏ' జట్టు శ్రీలంకకు చేరుకుంది. ఉత్కంఠభరితంగా సాగే ఈ టోర్నమెంట్‌లో వారు తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇక ఆట మొదలవుతుంది" అని ఎస్ఎల్ సీ పేర్కొంది. ఈ పర్యటనకు ముందు భారత జట్టులో రెండు కీలక మార్పులు జరిగాయి. తొడ కండరాల గాయంతో రియాన్ పరాగ్ సిరీస్‌కు దూరమవడంతో, అతని స్థానంలో రుతురాజ్ గైక్వాడ్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఐపీఎల్ 2026 చివరి దశలో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్నప్పుడు పరాగ్ ఈ గాయానికి గురయ్యాడు. ప్రస్తుతం అతను బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకోనున్నాడు. మరోవైపు, హర్ష్ దూబేకు సీనియర్ జట్టు నుంచి పిలుపు రావడంతో, అతని స్థానంలో అనుకుల్ రాయ్‌ను జట్టులోకి తీసుకున్నారు.

**భారత 'ఏ' జట్టు:** తిలక్ వర్మ (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్ కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ బదోని, నిశాంత్ సింధు, సూర్యాంశ్ షెడ్గే, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), విప్రాజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్వీర్ సింగ్, అన్షుల్ కంబోజ్, అర్షద్ ఖాన్, అనుకుల్ రాయ్.



# రేపటి నుంచి ఆఫ్ఘన్‌తో టెస్ట్ మ్యాచ్.. కోచ్ గంభీర్ కొత్త వ్యూహాలు

- –టెస్టుల్లో దేవదత్ పడిక్కల్ కంటే సాయి సుదర్శన్‌కే ప్రాధాన్యత
- –సాయి సుదర్శన్‌కు గతంలో సరైన అవకాశాలు రాలేదన్న గంభీర్
- –శ్రీలంక పర్యటనకు నలుగురు స్పిన్నర్లను సిద్ధం చేస్తామని వెల్లడి
- –వైస్ కెప్టెన్సీ కోల్పోయిన రిషభ్ పంత్‌కు మద్దతుగా కీలక సూచనలు
- –మ్యాచ్ పరిస్థితులను బట్టి ఆడటం పంత్ నేర్చుకోవాలని హితవు

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, తన మార్క్ నిర్ణయాలతో జట్టు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో ఏకైక టెస్ట్ మ్యాచ్ ప్రారంభానికి ముందు శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన గంభీర్, పలు కీలక విషయాలపై స్పష్టతనిచ్చాడు. ముఖ్యంగా టెస్టుల్లో మూడో స్థానం కోసం యువ ఆటగాడు సాయి సుదర్శన్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని, అతడికే ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశాడు. ఈ సందర్భంగా గంభీర్ మాట్లాడుతూ.. "సాయి సుదర్శన్‌కు గతంలో సరైన అవకాశాలు రాలేదు, అతడికి న్యాయం జరగలేదు. అతను ఎక్కువగా ఇంగ్లండ్‌లో ఆడాడు. కేవలం 4-5 మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా ఒక ఆటగాడిని అంచనా వేయలేం. ఐపీఎల్‌లో అతను 700 పరుగులు చేశాడు. అతడి ఫామ్ అద్భుతంగా ఉంది. అందువల్ల దేవదత్ పడిక్కల్ కంటే ముందు సుదర్శన్‌కు సరైన అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉంది" అని స్పష్టం చేశాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగే టెస్టులో సుదర్శన్ ఆడటం దాదాపు ఖాయమైంది. రాబోయే శ్రీలంక పర్యటన గురించి గంభీర్ తన ప్రణాళికలను వివరించాడు. లంక పర్యటనకు నలుగురు స్పిన్నర్లతో వెళతామని, ప్రస్తుతం జట్టులో నాలుగో స్పిన్నర్ స్థానం కోసం మానవ్ సుతార్, హర్ష్ దూబే మధ్య పోటీ ఉందని తెలిపాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగే ఈ మ్యాచ్ వారిద్దరిలో ఎవరు మెరుగ్గా రాణిస్తారో అంచనా వేయడానికి ఒక అవకాశమని అన్నాడు. "మానవ్, హర్ష్ బౌలింగ్ శైలిలో కొన్ని సారూప్యతలు, కొన్ని తేడాలు ఉన్నాయి. ఈ మ్యాచ్ ద్వారా నాలుగో స్పిన్నర్‌ను ఎంపిక చేస్తాం" అని పేర్కొన్నాడు. న్యూజిలాండ్ వంటి పర్యటనలకు సన్నద్ధత భిన్నంగా ఉంటుందని, అవసరమైతే టెస్టుల కోసం వన్డే రెగ్యులర్ ఆటగాళ్లను కూడా జట్టులోకి తీసుకుంటామని తెలిపాడు. ఇటీవల టెస్ట్ వైస్ కెప్టెన్సీ కోల్పోయిన రిషభ్ పంత్ విషయంపైనా గంభీర్ స్పందించాడు. "రిషభ్ పంత్ తన సహజమైన ఆటను మార్చుకోవాలని మేము కోరుకోవడం లేదు. కానీ, అంతర్జాతీయ క్రికెట్‌లో మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడటం, వాటిని గౌరవించడం చాలా ముఖ్యం. ఈ విషయాన్ని పంత్ గ్రహించాలి" అని హితవు పలికాడు. పంత్‌కు తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని, అయితే ఆటలో మరింత పరిణతి చూపించాల్సిన అవసరం ఉందని సూచించాడు.

# ఎన్ఐఏ కేసులో గాదె ఇన్నయ్యకు మధ్యంతర బెయిల్

**చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న గాదె ఇన్నయ్య**

**రెండు నెలల బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి కోర్టు**

**బెయిల్ గడువు ముగిసిన వెంటనే లొంగిపోవాలని ఆదేశం**

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నమోదు చేసిన కేసులో గత కొంతకాలంగా చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న తెలంగాణ ప్రజా ఫ్రంట్ ప్రతినిధి, సామాజిక హక్కుల నాయకుడు గాదె ఇన్నయ్యకు న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. నాంపల్లి కోర్టు ఆయనకు షరతులతో కూడిన 2 నెలల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కోర్టు నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడిన అనంతరం ఆయన చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఉగ్రవాద నిరోధక చట్టం కింద ఎన్ఐఏ నమోదు చేసిన కేసులో ఇన్నయ్య నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. జైల్లో ఉన్న సమయంలో ఆయన వ్యక్తిగత మరియు ఆరోగ్య కారణాలను, అలాగే కుటుంబ పరిస్థితులను పురస్కరించుకుని తనకు తాత్కాలికంగా బెయిల్ మంజూరు చేయాలని నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల లాయర్ల సుదీర్ఘ వాదనలు విన్న నాంపల్లి న్యాయస్థానం.. ఇన్నయ్యకు 2 నెలల పాటు తాత్కాలికంగా మధ్యంతర బెయిల్ ఇస్తూ నిర్ణయం తీసుకుంది. బెయిల్ గడువు (2 నెలలు) ముగిసిన వెంటనే ఆయన తిరిగి కోర్టు ముందు గానీ, జైలు అధికారుల వద్ద గానీ తప్పనిసరిగా లొంగిపోవాలని న్యాయమూర్తి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గాదె ఇన్నయ్య జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న కాలంలోనే ఆయన తల్లిదండ్రులు ఇద్దరూ మరణించడం ఆయన కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. గతంలో తల్లి అంత్యక్రియల సమయాల్లోనూ ఆయన కోర్టు ద్వారా స్వల్పకాలిక ముందస్తు అనుమతులు పొందాల్సి వచ్చింది. ఇప్పుడు కోర్టు 2 నెలల మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో, నాంపల్లి కోర్టు వద్దకు ఆయన కుటుంబ సభ్యులు, న్యాయవాదులు పెద్ద ఎత్తున చేరుకుని ఇన్నయ్యకు స్వాగతం పలికారు.



# సినిమా న్యూస్

## '29' (నెట్ ఫ్లిక్స్) మూవీ రివ్యూ!



కోలీవుడ్ నుంచి వచ్చే లవ్ స్టోరీస్ లో మంచి ఫీల్ ఉంటుంది. అందువలన ప్రేమకథాంశంతో కూడిన తమిళ సినిమాలకు ఓటీటీలో మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది. అలా ఈ మధ్య కాలంలో తమిళంలో రూపొందిన లవ్ స్టోరీనే '29'. రత్నకుమార్ వినిపించిన ఈ కథ వినగానే, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ .. కార్తీక్ సుబ్బరాజు నిర్మాతలుగా ముందుకు రావడం విశేషం. మే 8వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, ఈ రోజు (జూన్ 5వ తేదీ) నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో ఐదు భాషల్లో అందుబాటులోకి వచ్చింది. సత్య (విధు) తన తల్లిదండ్రులతో కలిసి 'సేలమ్'లో నివసిస్తూ ఉంటాడు. సత్య మొదటి నుంచి ముక్కుసూటి మనిషి. లోపల ఒకలా .. బయటికి ఒకలా ఉండటం అతనికి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. తనకి నచ్చినట్టుగా బ్రతకడమే తనకి ఇష్టం. అందుకోసమే అతను 'సేలం' నుంచి చెన్నైకి వెళతాడు. అక్కడే అతను మణి .. వసంత్ అనే స్నేహితులతో కలిసి ఒక రూమ్ లో ఉంటూ ఉంటాడు. జాబ్ విషయంలో అంతగా సంతృప్తి లేకపోయినా, ఖర్చుల కోసం నెట్టుకొస్తుంటాడు.

29 ఏళ్లు వచ్చినా తనని ఎవరూ ప్రేమించకపోవడం .. తనకంటూ ఒక లవర్ లేకపోవడం సత్యకు నిరాశను కలిగిస్తూ ఉంటుంది. అలాంటి పరిస్థితులలోనే అతనికి విజయలక్ష్మి (ప్రీతి అస్రాని) పరిచయమవుతుంది. ఆమెతో పరిచయం ప్రేమగా మారుతుంది. ఐఏఎస్ కావాలనేది విజయలక్ష్మి ఆశయం. అందుకోసం ఆమె కష్టపడి చదువుతూ ఉంటుంది. ఒక లక్ష్యం .. గమ్యం అనే ఆలోచన లేకుండా సత్య ఉండటం ఆమెకి అసంతృప్తిని కలిగిస్తూ ఉంటుంది.

విజయలక్ష్మికి తన తండ్రి ఎలా ఉంటాడనేది తెలియదు. తన చిన్నతనంలోనే వెళ్లిపోయిన తండ్రిని ఒకసారి చూడాలనే కోరిక ఆమెలో బలంగా ఉంటుంది. తల్లి కోరిక మేరకు తాను బాగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాన్ని చేయాలనే పట్టుదలతో ఉంటుంది. ఒక వైపున ప్రేమ అంటూ వెంటపడే సత్య. మరొక వైపున చదువు పూర్తి చేయమనే తల్లి. అలాంటి పరిస్థితులలో ఆమె ఏం చేస్తుంది? ఆమె తీసుకునే నిర్ణయం వాళ్ల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుంది? అనేది కథ.

కాలేజ్ చదువైపోయిన తరువాత ఒక్కో ఏడాది గడిచిపోతుంటే, ఇక జాబ్ రాదేమోనన్న టెన్షన్ సహజంగానే ఉంటుంది. అవకాశాలు వెదుక్కుంటూ వెళ్లకపోతే వెనకబడిపోతున్నామనే భయం మొదలవుతుంది. ఉన్న ఊళ్లోనే గొడవలు పడుతూ అవమానాలు పొందడం అలవాటైపోతుంది. అయితే '29' ఏళ్లు వచ్చినా ప్రేమలో పడకపోతే .. పెళ్లి ఆశలు కనిపించకపోతే అదే అసలైన టెన్షన్ అంటూ దర్శకుడు తయారు చేసుకున్న కథనే '29'. ఇది ఈ కథలో హీరోగారి ఏజ్.

ప్రేమించుకోవడానికి కులమతాలతో సంబంధం లేదు. నిజమైన ప్రేమికులు ఆర్థికపరమైన తారతమ్యాలు పట్టించుకోరు. అయితే ప్రేమికులు పుట్టి పెరిగిన వాతావరణం .. వాళ్ల కుటుంబ నేపథ్యాలు .. వాళ్ల ఆలోచనలను ప్రభావితం చేస్తాయనే అంశాన్ని దర్శకుడు టచ్ చేస్తూ వెళ్లాడు. తన ప్రేయసి తన కళ్లముందుంటే చాలని హీరో అనుకుంటాడు. తనకి మాదిరిగానే అతనికి కూడా ఒక లక్ష్యం .. గమ్యం ఉంటే బాగుంటుందని ఆమె భావించడం దగ్గరే ఈ కథ మలుపు తిరుగుతుంది.

ఈ కథ చాలా సింపుల్ గా ముందుకు వెళుతూ ఉంటుంది. సున్నితమైన భావోద్వేగాలను కలిగిస్తూ సాగుతూ ఉంటుంది. రొటీన్ గా కనిపించే సన్నివేశాలే అయినా, దర్శకుడు ఫీల్ మిస్సవ్వకుండా చూసుకున్నాడు. తన తల్లి ఆశయాన్ని నెరవేర్చడం కోసం హీరోను హీరోయిన్ దూరం పెడుతుంది. తన నుంచి విజయలక్ష్మి ఏం ఆశిస్తుందనేది అర్థమైన తరువాత, అతను ఒక ఆశయాన్ని ఏర్పరచుకుంటాడు.

సత్య తన తల్లి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రంగంలోకి దిగుతాడు. ఆ క్రమంలో డబ్బు – అధికారం ఉన్న వ్యక్తిని ఢీ కొనడం.. జైలు పాలు కావడం .. అయితే తన లక్ష్యాన్ని మార్చుకోకపోవడం ఈ కథను మరింత బలంగా మారుస్తూ ముందుకు తీసుకుని వెళుతుంది. ఒక లక్ష్యం పెట్టుకుని దానిని సాధించడంలోని ఆనందం ఎలా ఉంటుందనేది అప్పుడు అర్థం చేసుకుంటాడు.

కథలో భారీతనం .. కథనంలో ట్విస్టులు లేకపోయినా, సహజమైన సన్నివేశాలతో .. మనసుకు హత్తుకునే దృశ్యాలతో ఈ కథ ముందుకు వెళుతుంది. యూత్ లో ప్రతి ఒక్కరికీ ఇది తమ కథ అనిపిస్తుంది .. ఆకట్టుకుంటుంది. కథలోని ఈ ఫీల్ కారణంగానే లోకేశ్ కనగరాజ్ – కార్తీక్ సుబ్బరాజ్ నిర్మాతలుగా ముందుకు వచ్చారేమో అనిపిస్తుంది.

అక్కడక్కడా కాస్త సాగదీసినట్టుగా అనిపించినప్పటికీ, ఫీల్ తో మేనేజ్ చేస్తూ వెళుతుంది. విధు నటన ఆకట్టుకుంటుంది. అసలు అతను కెమెరా ముందు ఉన్న విషయాన్ని మరిచిపోయాడు. ప్రీతీ అస్రాని ప్రత్యేక ఆకర్షణ అనే చెప్పాలి. కడిగిన ముత్యంలా కనిపిస్తూ, తన నటనతోను యూత్ మనసులు దోచేస్తుంది. మాదేశ్ ఫొటోగ్రఫీ .. సీన్ రోల్డన్ సంగీతం .. సతీశ్ కుమార్ ఎడిటింగ్ ఫరవాలేదు.

ప్రేమ అనేది ఎంతో గొప్పది .. దానికి మించిన ప్రపంచం మరొకటి లేదు అని భావించే అబ్బాయికీ, ప్రేమ అనేది ఒక ఫాంటసీనే. జీవితమనే ప్రయాణం వాస్తవంలో చేయవలసి ఉంటుందని నమ్మిన అమ్మాయికి మధ్య జరిగే ఈ కథ యూత్ ను తప్పకుండా ఆలోచింపజేస్తుంది. ప్రేమ కొత్త ఆశలు చిగురింపజేస్తుంది. అయితే ఆశ కంటే ఆశయం గొప్పదని నిరూపించే సందేశం మనకి ఈ కథలో కనిపిస్తుంది.

**సినిమా వివరాలు**

సినిమా పేరు: 29
విడుదల తేదీ: 2026-06-05
తారాగణం: విధు, ప్రీతి అశ్రాని, మహేంద్రన్, అవినాష్
దర్శకుడు: రత్న కుమార్
సంగీతం: సీన్ రోల్డన్
బ్యానర్: స్టోన్ బెంచ్ క్రియేషన్స్
సమీక్షకుడు: పెద్దింటి
29 రేటింగ్: 5 కి 2.00

## కొత్త అవతారంలో అక్కినేని హీరో.. నిర్మాతగా మారిన నాగచైతన్య



అక్కినేని హీరో నాగచైతన్య నటుడిగా మరో మెట్టు పైకెక్కడంతో పాటు, నిర్మాతగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'దూత' ఎంతటి విజయం సాధించిందో తెలిసిందే. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా రాబోతున్న 'దూత 2' సిరీస్‌కు ఆయన నిర్మాతగా కూడా వ్యవహరించనున్నారు. విక్రమ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సిరీస్ రెండో భాగం నేడు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కింగ్ నాగార్జున హాజరయ్యారు. తొలి షాట్‌కు ఆయనే క్లాప్ కొట్టి యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సిరీస్‌తో తాను నిర్మాతగా మారుతున్న విషయాన్ని నాగచైతన్య సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. "దూత రెండో అధ్యాయంలోకి అడుగుపెట్టడంతో పాటు నిర్మాతగా నా తొలి అడుగు వేస్తున్నాను. ఈ శుభారంభం ఎంతో సంతోషంగా ఉంది. ఇక ముందుకు సాగడమే. అద్భుతాలు జరగబోతున్నాయి" అంటూ పూజా కార్యక్రమాల ఫొటోలను పంచుకున్నారు. హీరోయిన్ ప్రియా భవాని శంకర్ కూడా ఈవెంట్ ఫొటోలను షేర్ చేస్తూ.. "మళ్లీ అదే టీమ్‌తో కలిశాం. ఈ కార్యక్రమానికి హాజరై మాలో మరింత ఉత్సాహం నింపిన నాగార్జున గారికి ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. ఈ సిరీస్‌లో నాగచైతన్యతో పాటు పార్వతి తిరువోతు, ప్రియా భవాని శంకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.
గతంలో ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అయిన 'దూత' మొదటి భాగానికి విశేషమైన స్పందన లభించింది. భవిష్యత్తులో జరగబోయే ప్రమాదాలను ముందే అంచనా వేస్తున్న న్యూస్‌పేపర్ల వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించే సాగర్ అనే జర్నలిస్ట్ పాత్రలో నాగచైతన్య నటన అందరినీ ఆకట్టుకుంది. హత్య కేసులో ఇరుక్కున్న అతను, తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవడానికి చేసే ప్రయత్నం ఉత్కంఠభరితంగా సాగింది. శరత్ మరార్ నిర్మించిన తొలి భాగానికి కొనసాగింపుగా వస్తున్న ఈ రెండో భాగానికి నాగచైతన్య కూడా నిర్మాతగా చేరడం విశేషం.

## కాజల్ 'ది ఇండియా స్టోరీ'..

మనం రోజూ తింటున్న ఆహారం అమృతమా లేక విషమా అనే ఒక భయంకరమైన ప్రశ్నను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది ది ఇండియా స్టోరీ చిత్రం. కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా టీజర్ ను మేకర్స్ ఇటీవల విడుదల చేశారు. ఆహార కల్తీ అనే ఒక తీవ్రమైన జాతీయ సమస్యను ప్రధానాంశంగా చేసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ప్రతి ఒక్కరి జీవితంతో ముడిపడి ఉన్న పాయింట్ ను టచ్ చేయడం ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమా టీజర్ చూస్తే మనం బ్రతకడానికి తింటున్నామా లేక రోగాల బారిన పడటానికి తింటున్నామా అనే భయం పుట్టడం ఖాయం. పుచ్చకాయలకు ఇంజెక్షన్లు ఇవ్వడం దగ్గరి నుంచి, దేశంలో 68 శాతం పాలల్లో డిటర్జెంట్, ఆయిల్, యూరియా కలుస్తున్నాయనే భయంకరమైన వాస్తవాలను టీజర్లో కుండబద్దలు కొట్టినట్లు చూపించారు. ఇది కేవలం సినిమా కోసమో లేక డ్రామా కోసమో రాసుకున్న ఫిక్షన్ కాదు, ప్రతి నిత్యం మనం ఎదుర్కొంటున్న స్లో పాయిజన్ లాంటి రియాలిటీ అని అర్థమవుతుంది. కల్తీ ఆహారం వల్ల దేశంలో క్యాన్సర్ మహమ్మారి ఎలా కోరలు చాచిందో లెక్కలతో సహా మేకర్స్ తెరపై చూపించిన విధానం నిజంగానే ఒక అలారం లాంటిది. ప్రతి మూడు కుటుంబాల్లో ఒకరు క్యాన్సర్ తో పోరాడుతున్నారని, ప్రతి 60 సెకన్లకు ఒకరు లేదా ఇద్దరు ప్రాణాలు కోల్పోతున్నారని టీజర్లో వెల్లడించిన గణాంకాలు భయపెడుతున్నాయి. ఏటా పది లక్షల మందికి పైగా ప్రాణాలు పోవడానికి కారణమవుతున్న ఈ సైలెంట్ కిల్లర్ గురించి సామాన్యులను మేల్కొల్పే ప్రయత్నం ఈ సినిమాలో బలంగా కనిపిస్తోంది. స్టార్స్ అనగానే సాధారణంగా రొటీన్ కమర్షియల్ కథలకు ప్రాధాన్యత ఇస్తుంటారు. కానీ కాజల్ అగర్వాల్ లాంటి హీరోయిన్ ఇలాంటి ఒక సోషల్ అవేర్ నెస్ ఉన్న సబ్జెక్టును ఎంచుకోవడం మంచి నిర్ణయం. జీ స్టూడియోస్ లాంటి పెద్ద నిర్మాణ సంస్థ ఎంఐజీ ప్రొడక్షన్స్ తో కలిసి ఈ ప్రాజెక్ట్ ను నిర్మిస్తున్నారు. ఒక ప్రాంతీయ సమస్యగా కాకుండా ఇది దేశం మొత్తం ఎదుర్కొంటున్న ముప్పు కాబట్టి ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో ప్లాన్ చేశారు. ఇదే ఏడాది జూలై 24న హిందీ, తమిళ, తెలుగు భాషల్లో ఈ చిత్రం థియేటర్లలోకి రాబోతోంది. దర్శకుడు చేతన్ డీకే ఈ సీరియస్ సబ్జెక్టును స్క్రీన్ పై ఎంత రియలిస్టిక్ గా ప్రెజెంట్ చేస్తాడో చూడాలి. ఈ చిత్రానికి సాగర్ బి షిండే నిర్మాతగా వ్యవహరిస్తూ స్వయంగా కథను అందించారు. ది ఇండియా స్టోరీ టీజర్ కేవలం సినిమా ప్రమోషన్ లా కాకుండా, వ్యవస్థ వైఫల్యాన్ని ప్రశ్నించే ఒక డాక్యుమెంటరీ తరహాలో ఇంపాక్ట్ క్రియేట్ చేసేలా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ప్రతి ఇంట్లో ఉండే వంటగదిలో జరుగుతున్న ఈ కల్తీ దందా వెనుక ఉన్న అసలు మాఫియాను సినిమాలో ఎలా చూపించబోతున్నారో చూడాలి.



అద్భుతమైన బీచ్‌సైడ్ లుక్‌లో మయామి సూర్యరశ్మిని ఆస్వాదిస్తున్న అవనీత్ కౌర్. నేపథ్యంలో పడవ ఉండగా, సముద్రపు గాలిని ఆస్వాదిస్తూ, ఆమె వేసవి ఆనందాన్ని పరిపూర్ణంగా ఆవిష్కరించారు. ఆమె పంచుకున్నట్లుగా: "మయామి బీచ్, ఫ్లోరిడా. నేను కనిపించకుండా పోతే, దానికి కారణం నేను మయామిలో ఉండటమే."

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662